ప్రజాశక్తి

Vol. 4, no. 22

(May. 31, 1944)

బెజవాడ, 1944

Record no. 683

Prajāśakti

Vol. 4, no. 22

(May. 31, 1944)

Bejavāḍa, 1944

Record no. 683

Regd. No. M. 4486 0.2.0

ప్రజాశక్తి

భారత కమ్యూనిస్టుపార్టీ, ఆంధ్రకమిటీ పత్రిక

సంపుటి 4 సంచిక 22

: సంపాదకవర్గం :
మద్దుకూరి చంద్రశేఖరరావు (సం)
కంభంపాటి సత్యనారాయణ
పుచ్చలపల్లి సుందరయ్య
తుమ్మల వెంకటరామయ్య
చలసాని వాసుదేవరావు

బుధవారం 31-5-44

ప్రతిష్టంభన అంతమొందించడానికి ఐక్యత నిర్మించండి

●

గాంధీజీ విడుదలపట్ల ముస్లిం పత్రికల ఉత్సాహం

ఉర్దూ పత్రికలు యావత్తూ గాంధీజీ విడుదలకు సంతోషాన్ని వెలిబుచ్చాయి. కాంగ్రెసు-లీగు ఐక్యత ప్రాతిపదికమీద రాజకీయ ప్రతిష్టంభనా పరిష్కారానికి, గాంధీజీవిడుదల పనిచేస్తుందని ఆశించాయి.

రెండేళ్ళక్రితం లీగ్ పత్రికలు, లీగు నాయకత్వమూ, గాంధీజీ అన్నా, కాంగ్రెస్ అన్నా, అనుమానించుతూ తీవ్రంగావ్యతిరేకభావాల్ని ప్రదర్శించుతూ వచ్చారు. కాని ఈనాడు ఆవైఖరి చాలావరకు మారింది. కాంగ్రెస్-లీగుల ఒడంబడికవల్లనే పాకిస్థాన్ లభించగలదని లీగునాయకులు, పత్రికలు రోజు రోజుకూ ఎక్కువగా గ్రహించగల్గుతున్నారు. అందుచేతనే, కాంగ్రెస్-లీగు ఐక్యతను తీసుకురావడానికి శాయశక్తులా ప్రయత్నించగల వ్యక్తి ఈనాడు విడుదల అయాడని గ్రహించబట్టే, ఈనాడు వారు గాంధీజీ విడుదలకు హర్షించుతున్నారు.

లీగ్ పత్రికలు

"అ్రసేరి- యీ - జాదీద్" అనేది కలకత్తానుండి వెలువడే ముస్లింలీగ్ దినపత్రిక. అది మే 7 వ తేదీన ఇలా వ్రాసింది:

"గాంధిజీ విడుదల అయిన సందర్భంలో ఆయనను, మన దేశీయులను అభినందించుతున్నాం. గాంధీజీ విడుదల అయినందుకు భారతదేశ ప్రజలందరూ సంతోషిస్తున్నారు. ముస్లింలయెడ ఆయన వైఖరిఏమయినప్పటికీ, మనదేశంలోకల్ల గొప్పనాయకుడు గాంధిజీ అన్నది గమనించవలసిన విషయం."

కాని, 1942 లో ముస్లింలతో రాజీ పడకండా ప్రభుత్వంతో రాయబారాలు సాగించినందుకు, ఈపత్రిక గాంధిజీని నిందించింది.

"ఇంక్విలాబ్"

సింధు, మద్రాసులనుండి లీగ్ నాయకులు గావించిన ప్రకటనలను వ్యాఖ్యానించుతూ, "ఇంక్విలాబ్" అనే బొంబాయి దినపత్రిక ఇలా వ్రాస్తోంది:

"గాంధిజీ విడుదలపై ముస్లింలీగ్ నాయకులు ప్రకటించిన ప్రకటనలుజూస్తే, కాంగ్రెస్ - లీగ్ ఐక్యతకు ముస్లింలెంత ఆదుర్దా పడుతున్నారో తెలుస్తుంది. రాయబారాలు వెంటనే సాగాలని వా రాదుర్దాతో నిరీక్షించుతున్నారు. గాంధిజీకి ఆరోగ్యం చిక్కగానే, ఆయన లీగుతో పరిష్కారం చేసికొడానికి చొరవ తీసుకొంటాడని, ఆ విధంగా దేశద్రోహుల రాజకీయ జీవితాన్ని నాశనం చేస్తాడని, ముస్లింలంతా ఆశిస్తున్నారు.

"ముస్లింనాయకులు చేసిన ఈ ప్రకటనలను దృష్టిలో పెట్టుకొని, తన భావికర్తన్ని గాంధీజీ నిర్ణయించుకోవాలని మే మా శిం చున్నాము. హిందువులు లాగానే, ముస్లింలు కూడా ఆయనవంకే చూస్తున్నారని గాంధీజీ గ్రహించాలి. హిందూముస్లిం ఒడంబడికకు ఒక్కటే ఆటంకం వుంది. గాంధీజీ దానిని తొలగించి, స్వయంనిర్ణయహక్కును లేక, పాకిస్థాన్‌ను ఆమోదించినట్లయితే, హిందువులు ముస్లింలు తక్షణం ఐక్యమవుతారు."

"జమీందార్"

లాహోరు నుండి వెలువడే "జమీందార్" అనే పత్రిక "గాంధీజీ ఆత్మగౌరవంతో" విడుదలయినందుకు అభినందించింది. గాంధీజీకి త్వరలో ఆరోగ్యం చేకూరుగాకయని ఆ పత్రిక ఆశించింది. తక్కిన కాంగ్రెసు నాయకులను కూడ విడుదలచెయాలని ప్రభుత్వాన్ని కోరింది. అలా విడుదలచేస్తే, "అఖిలభారత సంస్థలు కలసి జపానుతో పోరాడటానికి" అవకాశం ఉంటుందని అంది. (మే 9)

ఇదే పత్రిక మే 7వ తేదీన గాంధిజీకి తీవ్రంగా జబ్బుగా ఉన్నందువల్ల తక్షణం విడుదల చేయవలసిందంటూ వ్రాసిన సంగతి మనం జ్ఞాపకం ఉంచుకోవాలి.

"మన్షూర్"

మన్షూర్ ఢిల్లీనుండి వెలువడే వార పత్రిక. ఇది చేసిన వాఖ్య అన్నింటిలోకి చాలా ముఖ్యమయింది. ఈ పత్రికకు జిన్నా అభిమాని కూడా.

"గాంధీ విడుదలవార్త సంతోషకరమైంది. గాంధీ విడుదలవల్ల ముఖ్యమైన రాజకీయ మార్పులు కలగవచ్చు.... కాంగ్రెసు - లీగు ఐక్యత తన ప్రధాన కర్తవ్యంగా గాంధీ తలచినట్లయితే, ఇండియాకు త్వరలోనే స్వాతంత్ర్యం లభించుతుంది.... ఇప్పుడు చొరవ గాంధీ చేతులలో వుంది. హిందూ ముస్లిం ఐక్యతకు, భారతదేశ స్వాతంత్ర్యానికి అన్నివిధాలా ప్రయత్నం చేయడానికి జిన్నా సిద్ధంగా ఉన్న ఈసమయంలో భారతదేశానికి స్వాతంత్ర్యంఇవ్వకుండా ప్రభుత్వం ఎట్టిసాకు చెప్పలేనట్టి పరిస్థితులను గాంధీ ముఖ్యంగా కల్పించగలడు." (మే 14)

ఓరియంట్ న్యూస్ ఏజన్సీ

ముస్లిం వార్తా ప్రచారసంస్థయైన "ఓరియంట్ ప్రెస్", కాంగ్రెసు - లీగ్ ఒడంబడికకు చాలా అవకాశాలున్నాయని భావించుతోంది. ఇది "ప్రస్తుత ప్రతిష్టంభనను తుదముట్టించటానికి గాంధిజీ తీవ్రంగా ఆలోచించుతున్నాడని" నమ్మదగిన భోగట్టామూలంగా తెలిసికోంటోంది. కాంగ్రెసు ఇదివరకే స్వయంనిర్ణయ హక్కును అంగీకరించిందనీ, ఆస్వయంనిర్ణయ హక్కును గుర్తించే ప్రాతిపదికమీద ముస్లింలీగ్‌తో గాంధిజీ ఒడంబడికకు రావడానికి చాల ఆదుర్దాపడుతున్నాడనీ, ఈవార్తాసంస్థ తెలిసికొంటుంది.

"1942 ఆగస్టులో గాంధిజీ.జిన్నాను చూడాలని కుతూహలపడ్డాడు. హిందూ ముస్లిం సమస్యను పరిష్కరించేందుకుగాను, జిన్నాకు ఒక ప్రముఖవర్తకుని ద్వారా ఉత్తరంకూడా పంపాడు. కాని ఇంతలోనే హఠాత్తుగా అరెస్టయాడు. అతని ప్లానులన్నీ భగ్నమయాయి."

జాతీయ ముస్లిం పత్రికలు

జాతీయ ముస్లింల సంగతి ఏమిటి? ముస్లింలీగ్‌వారి లాగానే వారూ గాంధిజీ విడుదలను హర్షించారు. ఢిల్లీ జాతీయ దినపత్రికయగు "అన్సారీ", గాంధిజీ విడుదలకు స్వాగతమిస్తూ, ఇతర కాంగ్రెసు నాయకులను కూడా విడుదల చేయవలసిందని ప్రభుత్వాన్ని కోరింది.

"ఈనాడు శత్రువు మన తూర్పు గుమ్మంలో ప్రవేశించాడు. ఇట్టి పరిస్థితులలో కాంగ్రెసు నాయకులను విడుదలచేయడం అవసరం. అందువల్ల ఇండియాలోకి చొచ్చుకువస్తున్న శత్రువును ఉమ్మడిగా ఎదుర్కొడానికి వీలవుతుంది" (మే 9)

"హింద్"

"హింద్" కలకత్తా జాతీయ ముస్లిం దినపత్రిక. ఇదివరకనేకసారులు లీగును తీవ్రంగా విమర్శించింది. గాంధీజీకి స్వాగతమిస్తూ "హింద్" ఇలా వ్రాసింది:

"ప్రభుత్వం, గాంధిజీని తదితర కాంగ్రెస్ నాయకులను అరెస్టుచేసి యుండవలసింది కాదు. ఎందువల్లనంటే, వారు చర్చిల్‌కు ఎంత ప్రతికూలురో, అంతగానూ ఫాసిస్టుదురాక్రమణ దారులను, నాజీలను, జపానువాళ్లను కూడా ఎదిరించుతారు.

"ప్రస్తుతం దేశాన్ని ఎదుర్కొంటున్న ముఖ్యసమస్యలు రెండు: రాజకీయ ప్రతిష్టంభనను అంతమొందించడం; మన పవిత్ర మాతృభూమిపై కాలుబెట్టిన జపాను దురాక్రమణదారులను ప్రతిఘటించడానికి యావద్భారత ప్రజలను సమీకరించుట.... మిత్రమండలిసైన్యాలు వీరోచితంగా పోరాడుతున్నప్పటికీ, శత్రువును ఓడించాలంటే భారతదేశ హృదయపూర్వక సహకారం, కార్యరూపకమైన సహకారం, అవసరం. కాని అట్టి సహకారానికి గాంధీజీ, కాంగ్రెసూమాత్రమే ప్రజలను ఉత్తేజపరచగలరని ప్రతివారికీ తెలుసు." రాజకీయ ప్రతిష్టంభన విషయమై "హింద్" ఇల్లావ్రాసింది.

"ఇప్పుడు గాంధిజీ విడుదలయ్యాడు గనుక, మొట్టమొదట కాంగ్రెసు-లీగ్ ఒడంబడికకై ప్రయత్నించాలి. జిన్నా-గాంధీల మధ్య జరిగిన ఏ ఒడంబడికనైనాసరే, కాంగ్రెసు-లీగ్ సంస్థలు బలపరుస్తాయని మా దృఢవిశ్వాసం. ముస్లింలకు స్వయంనిర్ణయ హక్కును ఈయండే, అనగా పాకిస్థాన్‌ను ఈయండే, ఎట్టి ఒడంబడికకు జిన్నా అంగీకరించడనేది సుస్పష్టమే. కాంగ్రెసు ఈ హక్కును సిద్ధాంతప్రాయంగా అంగీకరించింది. అందుచే పాకిస్థాన్ ప్రాతిపదికమీద, జిన్నాతో గాంధిజీ సులభంగా రాయబారాలు సాగించగలరు.

"కాంగ్రెసుతో జిన్నా ఎట్టి ఒడంబడికకు రాడని మేము ఎప్పుడూ అనుమానించుతూ వచ్చాం. అలాగే చెప్పాం కూడా. కాంగ్రెసు పాకిస్థాన్‌ను అంగీకరించినా కూడా ఒడంబడికను తప్పించుకొడానికి, జిన్నా ఏదో ఒక సాకుచెప్పుతాడు. అయినప్పటికీ, కాంగ్రెస్ స్పష్టంగా పాకిస్థాన్‌ను అంగీకరించి, ముస్లిం ప్రజలను సంతృప్తిపరచాలి." (మే 8)

"నూతనయుగాన్ని ఎందుకు ప్రారంభించకూడదు." అనేశీర్షిక క్రింద మరల వ్రాస్తూ ఈ పత్రిక కాంగ్రెసు-లీగ్ ఐక్యత కావాలని కోరింది.

"ముస్లింప్రజలకు ఏకైకప్రతినిధినని చెప్పుకొనే ముస్లింలీగ్, అదృష్టవశాత్తు, కాంగ్రెసును ఒకేఒక కోరిక కోరింది. అది పాకిస్తాన్, ఈ కోర్కె ఎలా ఆచరణయోగ్యకరమైందో జిన్నా వివరించాడు కూడా. అందుచే కాంగ్రెసు దీనిని సులభంగా అంగీకరించవచ్చు భారతదేశంలో ముస్లిములు, ఇతర జాతులవారు అధికసంఖ్యాకులుగా ఉన్నచోట్ల స్వతంత్రరాజ్యాలను (స్టేట్సు) ఏర్పరుచుకోవాలనే సూత్రాన్ని మేము ఆమోదిస్తాం."

"గాంధీజీ తన ఆరోగ్యం కోల్కోగానే, కాంగ్రెసు - లీగుల మధ్య ఒడంబడిక తీసు తీసుకురావడం గాంధీగారి ప్రథమకర్తవ్యమనీ, ఆవిధంగా ఒడంబడిక తీసుకువచ్చి, చరిత్రలో నూతన అధ్యాయాన్ని ప్రారంభించవలసిందనీ, మేము ప్రార్ధించుచున్నాం." (మే 9)

"ఆజ్మల్"

'ఆజ్మల్' బొంబాయినుండి వెలువడే జాతీయముస్లిం దినపత్రిక. అది ఈ భావాలను ప్రకటించింది: గాంధీజీ ఆరోగ్యం కుదుటబడ్డాక, రాజకీయరంగంలోకి హృదయపూర్వకంగా తిరిగి దూకుతాడు. గాంధీజీ మొదట ఈ రెండుసమస్యలను తీసుకొంటాడు: 1. కాంగ్రెసు జపానుకు అనుకూలంగా కొన్ని చర్యలు గావించిందని, ప్రభుత్వం చేసిన నిరాధారమైన నిందలను ఖండించుట; 2. హిందూముస్లిం ఐక్యత. ప్రభుత్వఆరోపణలకు గాంధీజీ హృదయం ఎంతో తపించిపోయింది. హిందూముస్లిం ఐక్యతనుగురించి ఆ పత్రిక ఇలావ్రాసింది:

"గాంధీజీ అరెస్టు కాకపోయినట్లయితే, జిన్నాను కలిసికొని యుండేవాడు....జిన్నా అనవసరమైన మొండితనాన్ని ప్రదర్శించడని ఆశిస్తున్నాం. కాంగ్రెసుతో ఒడంబడిక రావడానికి జిన్నా తన ప్రవర్తనలో తగుమార్పులు గావించుకొంటాడని ఆశించుతున్నాం."

ప్రజాశక్తి చందావివరాలు

★

సంవత్సరం చందా	5—0—0
అర్ధసంవత్సరం చందా	2—8—0
మూడునెలల చందా	1—4—0

బుధవారం **ప్రజాశక్తి** 31-5-44

అస్సాం ప్రజలకు సాయం చెయ్యాలి

అస్సాం ప్రజలను దండయాత్ర ప్రమాదం భీషణరూపంలో ఎదుర్కొంటూంది. జపాన్ బాంబులు అపుడే గ్రామాలకు గ్రామాలను దగ్ధం చేస్తున్నాయి. అస్సాం సరిహద్దున మణిపూర్ సంస్థానంలో జపాన్ దురాక్రమణదారులకు వ్యతిరేకంగా తీవ్రమైన యుద్ధాలు సాగుతున్నాయి. పంజాబు ముస్లిములు, సిక్కులు, మద్రాసు సేపర్సు, వగైరా భారతసైనికులు యుద్ధరంగంలో నిలబడి శత్రువును ఎదిరించుతున్నారు. బ్రిటీషు, అమెరికన్ సైన్యాలతో కలసి భారతీయులు తమ రక్తాన్ని ధారబోసి మాతృదేశాన్ని రక్షించుతున్నారు. దేశానికి ద్రోహంచేయమని రేడియోద్వారా కోరుతున్న జపాన్ ఏజెంటు బోసుకు భారత సైనికులు తమ వీర కృత్యాలద్వారా జవాబు చెబుతున్నారు.

కాని, యీ సమయంలో ప్రభుత్వ అధికారులు ఏమిచేస్తున్నారు? తమ మాతృభూమిని రక్షింకోడానికి సైన్యాలకు సంపూర్ణసహకారం చేయునట్లుగా ప్రజలను ప్రోత్సహించుతున్నారా? అంటే ఏమీచేయడంలేదనే చెప్పాలసివస్తుంది. ఈ నిరంకుశాధికారులు కండ్లుతెరచి దేశాన్నెదుర్కొంటున్న భీషణ ప్రమాదాన్ని గుర్తించడమే లేదు. పైగా ప్రజల మనోనిబ్బరాన్ని కాపాడటానికి కృషిచేస్తున్న దేశభక్తులకు అనేక విధాల ఆటంకాలు పెడుతున్నారు.

కాంగ్రెసు ప్రధానిగా పనిచేసిన బార్డోలాయ్ అస్సామ్‌ప్రజలను ప్రతిగ్రామాన్ని కోటగాచేసి రక్షించమని కోరాడు. నిజంగా యీ ప్రజానాయకుడు రాష్ట్రమంతా తిరిగి శత్రువును పారదోలడానికి ప్రజలను సమీకరించగలడు. కాని అధికారులు అతనిని ఎచటికి కదలరాదని యింటరన్ చేశారు. అదేవిధంగా మణిపూర్ ప్రజల హృదయాలలో స్వాతంత్ర్య జ్యోతిని వెలిగించగల నాయకుడు ఐరావత్‌సింగును అధికారులు అరెస్టుచేశారు. ఆత్మరక్షణసంఘాలను నెలకొల్పుతూ, భస్మమవుతున్న గ్రామాలను రక్షించడానికి పూనుకొంటున్న కిసాన్‌నాయకులను జైళ్ళలో పెడుతున్నారు. ప్రజలలో వ్యాపించిన భీతిని, వదంతులను, తొలగించడానికి దేశభక్తులకు సభలుపెట్టే అవకాశం యివ్వడంలేదు.

డిబ్రూగర్ అనే పట్టణంలో కాంగ్రెసు, లీగు, కమ్యూనిస్టుపార్టీల ప్రతినిధులు ఆహారసమస్యను గురించి సభ పెట్టడానికి అనుమతి కోరారు. కాని డిప్యూటి కమీషనర్ అనుమతి నిరాకరించాడు. రేడియో ద్వారా ప్రభుత్వంచేసే ప్రచారం చాలు, యింకేమీ అక్కరలేదని మొండిగా సమాధానమిచ్చాడు. 'సైన్యాలు పోరాడుతాయి; ప్రజలు, పార్టీలు మెదలకుండా కూర్చుంటేచాలు,' అనే దృష్టిని అధికారులు వహించుతున్నారు.

అధికారులు యీవిధంగా దేశభక్తుల ప్రచారాన్ని అరికడుతుంటే, జపాన్ ఏజెంట్ల దుష్ప్రచారం ప్రజలలో భీతిని వ్యాపింపజేస్తూంది. పేరుకు లీగ్ మంత్రివర్గం వున్నా నిరంకుశాధికారుల పెత్తనం అడ్డులేకుండా సాగుతోంది. ఇందువల్ల ప్రజలలో అలజడి పెరిగి ప్రమాదం మరింత తీవ్రమౌతోంది.

నేటి పరిస్థితుల్లో అస్సాము ప్రజలు, రాజకీయ పార్టీలు విషమపరీక్షకు గురి అవుతున్నారు. ఒకవైపున వారు జపాన్ దురంతకులనుండి మాతృభూమిని రక్షించుకోవాలి. మరోవైపున అధికారులు పెడుతున్న ఆటంకాలు. భారతదేశమంతా అస్సాం అధికారుల ఆటంకాలను తొలగించి, ప్రజలలో దేశభక్తి ప్రచారంచేయడానికి సాయపడాలి. రాజకీయ పార్టీలన్నీ యిందుకు పూనుకోవాలి. కాంగ్రెసు, లీగు దేశభక్తులు, ప్రజాసంస్థలు, అస్సాం దేశభక్తులను వెంటనే విడుదలచేయాలని, ఆందోళనచేయాలి. ప్రజల హృదయాలలో స్వాతంత్ర్య జ్యోతిని వెలిగించి దేశరక్షణ తమ కర్తవ్యమని గ్రహించునట్లు చేయాలి.

అందుకొరకు అస్సాందేశభక్తులకు భారతదేశమంతా అండగా వుందని తెలియజేయాలి. అస్సాంలో దేశభక్తి ప్రచారం చేయడానికి పౌరసత్వ హక్కులు యివ్వాలని ఆందోళన చేయాలి.

మన రాజకీయాలు

వాతావరణం ఆశాజనకంగా ఉంది

విభేదాలను తొలగించుకోడానికి దీనిని వినియోగించుకోవాలి

మద్దుకూరి చంద్రశేఖరరావు

మే 10వతేదీన జిన్నాజీ కాశ్మీర్‌సంస్థానం ముఖ్యపట్టణమైన శ్రీనగర్ వచ్చాడు. అపుడు 60 వేలమంది జిన్నాజీకి అఖండ స్వాగతమిచ్చారు. కాశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్సు అధ్యక్షుడు, సుప్రసిద్ధ దేశభక్తుడు, అయిన షేక్‌మహమ్మద్‌అబ్దుల్లా స్వాగతసభలో మాట్లాడుతూ, "భారతదేశంలో విదేశ పరిపాలన తొలగించడానికి నేడు ఒకటే మార్గముంది. కాంగ్రెసు - లీగ్ పార్టీలమధ్య ఐకమత్యమే అందుకు సాధనం" అని చెప్పాడు. ఈ ఆశయంకోసం పనిచేయడం ప్రతి దేశభక్తుని కర్తవ్యమని తెలియజేసాడు.

ముస్లింలు హిందువులు అంతాకలసి యిచ్చిన అద్భుతమైన ఈస్వాగతాన్ని చూచి జిన్నాకూడ ఉప్పొంగిపోయాడు. అబ్దుల్లా ఉపన్యాసం తరువాత నేషనల్ కాన్ఫరెన్సు కార్యదర్శి మౌలానామసూదీ ఇలా మాట్లాడాడు:

"భారతదేశంలోవున్న జాతులన్నీ కలసి ఐకమత్యంతో పనిచేయడంపైనే 40 కోట్ల భారతీయుల స్వాతంత్ర్యం ఆధారపడివుంది. నేడు కాంగ్రెసు - లీగు మధ్య ఐక్యత ఏర్పడిందంటే భారతీయులంతా ఏకమైనట్లే. కేంద్రశాసనసభలో యీ రెండుపార్టీలుకలిసి పనిజేసి సాధించిన విజయాలను ఇంకా ముందుకు తీసుకుపోవాలంటే రెండుసంస్థలమధ్యా ఐకమత్యం ఏర్పడాలి."

తరువాత పండిత శ్యామ్‌లాల్‌జిన్నా దేశానికి చేసిన సేవను కీర్తించాడు. ఈ స్వాగతాలకు జిన్నాజీ సమాధానం ఇచ్చాడు.

కాశ్మీర్ ప్రజలు యిచ్చిన గొప్ప స్వాగతానికి గర్వించుతున్నానన్నాడు. తనను గౌరవించడమంటే భారత ముస్లింజాతినే గౌరవించడమన్నాడు. అన్నిజాతులకు, వర్గాలకు చెందిన ప్రజలు కలసిమెలసి శాంతంగా జీవించాలని సలహాయిచ్చాడు. స్వాతంత్ర్యం కొరకు, స్వయంనిర్ణయహక్కు కొరకు జరిగేపోరాటం త్వరలో విజయం గాంచుతుందనే ఆశను వెల్లడించాడు.

బనిహాల్‌నుంచి శ్రీనగరుకు వెళ్లే రోడ్డు పొడుగునా అనేకచోట్ల వేలకొలది రైతులు జిన్నాజీకి యిదేవిధంగా స్వాగతమిచ్చారు. నేషనల్‌కాన్ఫరెన్సువారి ఎర్రజెండాలతో వీరు జిన్నాను ఆహ్వానించారు.

నేషనల్ కాన్ఫరెన్సు కాశ్మీర ప్రజలందరి విశ్వాసాన్ని చూరగొన్న సంస్థ. దానియందు ముస్లింలకు, హిందువులకు—కాశ్మీర్ ప్రజాసామాన్యానికంతటికీ విశ్వాసముంది. కాశ్మీర ప్రజలకు బాధ్యతాయుత ప్రభుత్వంకోసం నేషనల్ కాన్ఫరెన్సు యిదివరకు అనేక పోరాటాలను నడిపింది. అధ్యక్షుడైన షేక్ అబ్దుల్లా కాశ్మీరప్రజల నాయకుడు. భారత ప్రజలపై గాంధీజీ కెంత పలుకుబడి వుందో కాశ్మీర ప్రజలపై అబ్దుల్లా కంత పలుకుబడివుంది. గొప్ప జాతీయవాది. నెహ్రూ స్నేహితుడు కూడా. ఇలాంటి ముస్లిం దేశభక్తులు జిన్నాకు స్వాగతమిస్తూ చెప్పినమాటలు ఎంత విలువైనవో వేరే వర్ణించ నక్కరలేదు. ముస్లిం ప్రజలందరూ క్రమంగా లీగు పలుకుబడి క్రిందికి వస్తున్నా రనడానికి చక్కని ఉదాహరణ ఇది.

అబ్దుల్ క్వయాం

ఢిల్లీ అసెంబ్లీలోని కాంగ్రెసుపార్టీ ఉపనాయకుడు, సరిహద్దురాష్ట్ర కాంగ్రెసుప్రముఖుడు, అయిన అబ్దుల్ క్వయాం అదే విషయాన్ని చక్కగా వివరించాడు. కాశ్మీర్ ప్రజలందరూ అన్ని మతాలవారు జిన్నాకు స్వాగతమిచ్చారు; అన్నిపార్టీలు, మతాలవారు కలసి కాశ్మీర్ ఔన్నత్యంకొరకు కృషిచేయాలని జిన్నా కాశ్మీరప్రజలను ఉద్బోధించాడన్నారు. ఇంకా అబ్దుల్‌క్వయాం ఇలా చెప్పాడు:

"ఈ గొప్పదేశాన్ని విభజించడం అంత సులభమయిన విషయంగాదని జిన్నా గుర్తించుతాడని యింకా ఆశవుంది. ముస్లిం ప్రజలుకూడ విభజన, విడిపోవడం తమకు లాభకరంగాదని గ్రహించవచ్చును. కాశ్మీర్, సింధు, బెలుచిస్థాన్ పంజాబు, సరిహద్దు రాష్ట్రాలలో వున్న ముస్లిం ప్రజలకు తక్కినవారిపై పెత్తనం చేయాలనే భావంలేదు." అని చెప్పాడు.

కాంగ్రెసు నాయకుడు, సుప్రసిద్ధ జాతీయవాది, అబ్దుల్‌క్వయాం పైవిధంగా చెప్పడానికి కారణం ఏమిటి? ఆయన ముస్లిం ప్రజలంతా జిన్నాను, లీగ్‌ను, బలపరచడం చూస్తున్నాడు. స్వయం నిర్ణయ హక్కును కోరుతున్నారని గ్రహించాడు. ముస్లిం జాతులకు యీ న్యాయమైన హక్కు యివ్వడం ద్వారానే హిందూ ముస్లిం ఐకమత్యం ఏర్పడుతుందని తెలిసికొన్నాడు. కలసి పనిచేయడం వల్లనే స్వాతంత్ర్యం సంపాదించగలమని గుర్తించుతున్నారు. ఆస్వాతంత్ర్య రక్షణ కొరకే హిందూ - ముస్లిం ప్రజలంతా కలసి వుండాలనే సత్యాన్ని గ్రహించుతారని విశ్వసించుచున్నాడు.

ఖాలీఖుజ్జమాన్ ప్రకటన

గాంధీజీకి మౌలానాఅజాద్ ఎలా కుడిభుజమో జిన్నాజీకి (మిగతా 3 వ పేజీలో)

★ యుద్ధసమీక్ష

అరకాన్ రంగంలో శత్రుప్రమాదం హెచ్చింది

— తుమ్మల వెంకటరామయ్య

మిచీనా విమానాశ్రయాన్ని జనరల్ మెరిల్ సేనలు 18 వ తేదీన పట్టుకొన్నాయి. 6100 అడుగుల నౌరామైకట్ కనుమ దాటిన ఈ చైనా అమెరికన్ సేనలు, మిచీనాలోని రైలుస్టేషన్‌ను వశపరచుకున్నాయి. మిచీనాలో 3 వ వంతును కూడా వశం చేసుకున్నాయి. మిచీనా ఉత్తరబర్మాలో చాల ప్రాముఖ్య కేంద్రం. అది జపాను చేతులలో ఉన్నంతకాలం చైనాను మిత్ర సేనలకు సంబంధం లేకుండా దూరంగా ఉంచగలదు. అంతేగాక, జపాను తన సైన్యాలను, సాధన సంపత్తిని, ఏరంగానికి పడితే ఆరంగానికి పంపుకోడానికి వీలైన కేంద్రంగా అది వుంటుంది. మిచీనా - లిడో - భామో - లాషియోలను కలిపిచైనాకు సప్లయి లందజేయాలని స్టిల్వెల్‌ప్రయత్నం.

జపాను విశ్వప్రయత్నం

అందుచేతనే జపాను అత్యంత భీకరంగా యుద్ధంచేసి తిరిగి రైలుస్టేషన్‌ను వశంచేసుకొంది. మిచీనాలో చాలా భాగం నాలుగైదు సార్లు చేతులు మారాయి. అయినప్పటికీ, విమానాశ్రయం ఇంకా మనవాళ్ల చేతులలోనే వుంది. మిచీనానుండి మొగాంగ్‌కు పోయే రోడ్డుమీద ప్రతిబంధకాలను కల్పించారు. మనవాళ్లు. జపాను అదనపు సైన్యాలు యిటునుండి రాకుండా చేయాలని మనవాళ్ళ ప్రయత్నం. ఉత్తరంనుండి, మన సైన్యాలు క్రమ్ముకొంటున్నాయి. పశ్చిమంనుండి జపానుకు అదనపు సేనలు రాకుండా నామిక్వీవద్ద రాకపోకలను మనసైన్యాలు తెగగొట్టాయి. భామో నుండి కూడా రాకపోకలనుగూడ మనవాళ్ళు తెగగొట్టారు.

మిచీనానుండి మొగాంగ్‌కు, భామోకు వెళ్ళే రాకపోకలను అరికట్టి జపానుకు నష్టంకల్గించడంలో చిండిట్ సైన్యాలు బాగా సహాయపడ్డాయి.

ఇక యూనాన్‌నుండి దండయాత్ర ప్రారంభించిన చైనాసైన్యాలు సాల్వీన్‌నది పశ్చిమతీరాన బర్మా రోడ్డుమీద ఉన్న చెఫాంగ్‌ను వశపరచుకొన్నాయి. ఇది భామోకు 80 మైళ్ళుంటుంది. అంటే చైనా సైనికులు లాషియోకు 100 మైళ్ళలోకి వచ్చారు. చిండిట్స్ పనిచేసే భాండ్‌కు 70 మైళ్ళలోకి వచ్చారు.

కాని ఇంతటితో మిచీనా ఒంటరి అయిపోలేదు. పరిస్థితులు చక్కబడ్డాయనీ తలంచరాదు. అనుకున్న దానికంటె జపాను ప్రతిఘటన నిలిచిందనీ, చిన్న ముఠాలుగా శత్రువులు ఎలాగో అదనంగా వచ్చాయనీ (వీటిని అదనపు సైన్యాలని పిలువకపోయినా) విలేఖరులు వ్రాస్తున్నారు.

కాని, అటు జనరల్ స్టిల్‌వెల్ చైనా—అమెరికా సైన్యాలు, ఇటు చైనాసైన్యాలు కలిసి, మిచీనాలో జపానుసేనల్ని చుట్టుముట్టి హతమార్చాలనే ఆశయం ఇంకా నెరవేరలేదు. అప్పుడే వర్షాకాలం ప్రారంభించింది. వర్షాలింకా తీవ్రంగాక ముందే మిచీనాను పట్టుకొనకపోతే ఇప్పటి విజయాలన్నీ వ్యర్థమౌతాయి. భయంకర వర్షప్రవాహాలను, మలేరియా బాధలను మన సైనికులు తట్టుకోవలని వస్తుంది. అప్పుడు చిండిట్ సైన్యాలు ఇండియాకు, స్టిల్‌వెల్ సైన్యాలు ఉత్తర అస్సాంకు, చైనీయులు యూనాన్‌లోకి తిరిగివెళ్ళవలసివస్తుంది.

చుంకింగ్ ఇచ్చటి మిలటరీ పరిస్థితులపై ఆశాజనకంగా మాట్లాడటంలేదు. "మున్ముందు యుద్ధం భయంకరంగా వుంటుంది. స్టిల్‌వెల్ సేనలతో మన సేనలు కలవనీయకుండా జపాను విశ్వప్రయత్నం చేస్తోంది. వర్షాలు కూడ మనకు ప్రతిబంధకం గావచ్చు." అని అంటుంది.

ఉత్తరబర్మాలో వర్షాలువస్తే, సప్లయిలు తగ్గి, మలేరియామొదలైన వ్యాధులతో మిత్ర సైన్యాలు బాధ పడతాయి. కాబట్టి అక్కడ మిచీనాలాంటి కేంద్రాలను రక్షించుకోడమే జపానుకు ప్రధానలక్ష్యం. కాని అస్సాం, అరకాన్ రంగాలలోజపాను లక్ష్యం మనదేశంలోకి చొచ్చుకుపోవడం, మన మాతృభూమికి ప్రమాదం కల్గించడం.

అస్సాం రంగంలో

మే 23 వ తేదీన ఆగ్నేయ ఆసియా సైనిక ప్రకటన, "బ్రహ్మపుత్రా లోయలో మన రాకపోకలకు ఎట్టి ప్రమాదమూ లేదని" ప్రకటించింది. బ్రహ్మపుత్రా లోయకు ఇదివరకైనా ప్రమాదం వున్నదని బహిరంగంగా చెప్పడం ఇదే మొదటిసారి. కాని ఆ ప్రమాదం ఇపుడు తప్పిందా? గత వారం యుద్ధచర్యలు చూస్తే లేదనే అనవచ్చు.

నాగా గ్రామంలో శత్రువులింకా పూర్తిగా తుడిచిపెట్టబడలేదు. కొహిమాప్రాంతంలో శత్రువులు చుట్టూ పీఠంవేసుక కూర్చున్నారనీ, వారిని తరమడం- ముఖ్యంగా కొహిమాకు దక్షిణాన వున్న 'అరదురా'శిఖరంవద్దనున్న శత్రువులను తరమడం - కష్టమనీ, అసోసియేటెడ్ ప్రెస్ ప్రత్యేక విలేఖరి రేమాండ్ ఓకెల్లీ వ్రాస్తున్నాడు. కొహిమా నుండి లిడూవరకు వ్యాపించిన నాగపర్వతాల నుండి జపానువాళ్ళను తరమండే, చిండ్విన్ వరకు శత్రువులను నెట్టండే, బ్రహ్మపుత్ర లోయకు ప్రమాదంతప్పిందనటం పొరపాటు.

అంతేగాదు. కొహిమా ఈ పరిస్థితులలో ఉన్నన్నాళ్ళు దిమపూర్‌నుండి ఇంఫాల్‌కు సప్లయిలు రావు. ఇంఫాల్ ఇంకా చుట్టుముట్టడింపబడిన దానిక్రింద లెక్క. సప్లయిలు విమానాలద్వారా రావాలి. వర్షాలెక్కువైన కొలదీ విమానాలద్వారా సప్లయిలు కష్టమవుతాయి.జపానుకు ఈరంగంలోఅదనపుసైన్యాలు సామగ్రిరావడంలేదని వ్రాసిన విలేఖరే మరల జపాను తనరిజర్వు సైన్యాలను సామగ్రిని తెచ్చుకొంటుందని వ్రాస్తున్నాడు. (అసోసియేటెడ్‌ప్రెస్ ప్రత్యేకవిలేఖరి) వర్షాలు బాగా ముమ్మరం కాకముందే, విమానాశ్రయాలను, ఆహారసప్లయిలతో సహా ఇంఫాల్‌ను పట్టుకోవాలని తుదిప్రయత్నం జపాను చేస్తున్నదని ఇతడే వ్రాస్తున్నాడు.

ఇందుకు నిదర్శనంగా బిషెన్‌పూర్‌లోను, ఇంఫాల్‌కు దక్షిణాన భయంకర యుద్ధాలు చెలరేగడం మనం జూస్తున్నాం.

ఇక, టామూరోడ్డులో ఇంఫాల్‌కు 33 వ మైలులో ఒకచోట అవరోధం మనవాళ్ల ఏర్పరిచాడు. 10, 11 మైలురాళ్ళవద్ద అలాంటి ప్రయత్నమే జపాను జరిపింది. టామూ - పాలెల్‌రోడ్డుపై శత్రుసంచలన అలాగేవుంది.

అరకాన్ రంగములో

ఇంతేగాదు.అరకాన్ రంగంలో ప్రమాదం రోజురోజూ హెచ్చుతోంది.

లబావాకుపశ్చిమంగాశత్రువులదాడిని తిరగగొట్టామని ఒక రోజునవార్త. మాంగడాకు నైరుతిగాను,టౌంజ్ బజారుకు దక్షిణంగాను, జపానుచిన్నచిన్నదాడులు జరిపిందని మరొక వాదం. మాయూపర్వతశ్రేణి పశ్చిమశిఖరాల నుండి జపానువాళ్ళు వెనక్కుతగ్గారని ఇంకొక రోజునవార్త. మాంగడా, బుథీడాంగ్ రోడ్డు మీద శత్రువుల సంచలనం ఉందని మరొక వార్త. ఇంతేగాదు.వర్షాకాలంప్రారంభంకాగానే ఈ ప్రాంతాన్నంతటినీ వశపరచుకోవాలని జపాను ప్రయత్నించుతుందని అసోసియేటెడ్‌ప్రెస్ ప్రత్యేకవిలేఖరి వ్రాస్తున్నాడు. ఇదివరకే 5 వ డివిజను ఇక్కడినుండి ఇంఫాల్‌కు పంపబడిన సంగతి మనకు తెలిసిందే. చిటగాంగ్‌కు మరింత ప్రమాదం హెచ్చిందని ఇవన్నీ తెలియజేస్తున్నాయి.

ఈ విధంగా పరిస్థితులు పైకి సుముఖంగా కన్పించినా, శత్రుప్రమాదం ఏమాత్రం తగ్గలేదని జాగ్రత్తగా పరిశీలించితే బోధపడుతుంది.

ఇటలీ

ఇటలీలో, గుస్టావ్, హిట్లర్ శ్రేణులు భేదించబడ్డాయి. లిరీలోయనుండి శత్రువుకాళ్ళకు బుద్ధిచెపుతున్నాడు. రోమ్‌నగరానికి ముందు వెల్లిట్రి-వాల్‌మాంటోన్ అనేకేంద్రాలను తమ ప్రతిఘటనాకేంద్రాలుగా జర్మన్లు చేయాలని ప్రయత్నించుతున్నారు. కాని అప్పుడే వెల్లిట్రిని మన సైన్యాలు ప్రక్కగా దాటాయి.

సిస్టిర్నా రైల్వేరోడ్ జంక్షన్ మన సేనల వశమయింది. అందుచే రోముకు దారి సులభమయిపోది, రోముకు 21 మైళ్ళలోకి మన సైన్యాల్లు వచ్చాయి. ఇటలీ పశ్చిమకోస్తాన గూడా అనేముఖ్యపట్టణాలు మనసైన్యాలు వశమయ్యాయి.

ఈవిజయాలకుతోడు,మిత్రరాజ్యాలుపశ్చిమ యూరప్‌పై దండయాత్ర సాగించినప్పుడు, ఇటలీనుండి హిట్లరురిజర్వుసైన్యాలుపోకుండా యుద్ధంలోకి దింపాలనే మిత్రరాజ్యాల ఆశయంకూడ నెరవేరింది. ఇంతేగాక, ఇటలీలోని 25 జర్మన్ డివిజన్లకు 6 డివిజన్లకు ఉత్తరాన ఇటాలియన్ గెరిల్లాలు పని కల్పిస్తున్నాయని, ఇటాలియన్ దేశభక్త సైన్య ప్రకటన తెలియజేస్తుంది. ఇటలీ సైనికుల, జనరల్ అలగ్జాండర్ సైనికుల ప్రతినిధులతో కలిసి ఏర్పడిన మిలిటరీ కౌన్సిల్, ఉత్తర ఇటలీలోని గెరిల్లాలకు సహాయం చేస్తున్నదని వినడం ఇదే మొదటిసారి. ఇది శుభసూచకం.

29—5—44

(2 వ పేజీ తరువాయి) చౌదరీ ఖాలీఖుజ్జమాన్ అలాంటివాడు. అతని సలహాలను జిన్నా ఎప్పుడూ గౌరవించుతాడు. ఖాలీఖుజ్జమాన్ పూర్వం కాంగ్రెసువాదే. ఇపుడు అఖిలభారత లీగ్ వర్కింగ్‌కమిటీ సభ్యుడు. ఆయన తంజాపూర్‌జిల్లా ముస్లింలీగ్ మహాసభకు అధ్యక్షత వహించుతూ యిలాచెప్పాడు:

"ప్రతిష్టంభన తొలగించడానికి యుద్ధం జరిగేటంతకాలం అవకాశం లేదా అనిపించేది. కాని గాంధీజీ విడుదలతో మళ్లీ అవకాశంఏర్పడింది. గాంధీజీ ఆరోగ్యం పొందిన వెంటనే యీ అవకాశాన్ని వినియోగించుతారని ఆశించుతాను.

"వాతావరణమంతా ఆశాజనకంగా వుంది. దీనిని వినియోగించుకొని, మన విభేదాలను తొలగించుకొనకపోతే ప్రపంచం మనలను క్షమించదు."

జాతీయపత్రికలు

లీగ్‌నాయకులు రాజీకి సుముఖంగా ఉన్నారని పైవిషయాలు తెలియజేస్తున్నాయి. కాని కాంగ్రెసు పత్రికలు దీనికి విరుద్ధమైన దృక్పథం అవలంబిస్తున్నాయి. లీగ్-కాంగ్రెసుల మధ్య రాజీకి అవి ప్రయత్నించడంలేదు. రాయబారాలకోసం ప్రభుత్వంవైపు, వేవెలు వైపు ఎదురుచూస్తున్నాయి.

"గాంధీజీ విడుదల అనంతరం ప్రభుత్వం తనపాలసీ మార్చుతుంటుందనీ, రాజకీయ ప్రతిష్టంభన తొలగించడానికి ప్రయత్నించుతుందనీ, పత్రికలు జోస్యం చెప్పసాగాయి. కాని నమ్మకస్తులద్వారా విచారణచేయగా ఇలాంటి వ్రాతలకు తగినకారణం లేదని తెలిసింది." అని హిందూపత్రికా విలేఖరి తెలియజేసాడు.

పార్లమెంటులో అడిగిన ప్రశ్నలకు సమాధానం జెబుతూ ఇండియామంత్రి తన మొండి చెయ్యి బయటపెట్టాడు. గాంధీజీ విడుదలకు కేవలం జబ్బే కారణమట. ఆగస్టుతీర్మానం అలావుండగా తక్కిన కాంగ్రెసునాయకులను విడుదల చేయరట. వివిధపార్టీలమధ్య రాజీ కుదిరే అవకాశం కన్పించడం లేదట.

అమెరీ ఏమిచెప్పినా ఒకటిమాత్రం నిజం. ఉపవాస సమయంలో ప్రజాందోళన రుచి చూచాక జబ్బుగావున్న గాంధీజీని జైలులో వుంచడానికి ప్రభుత్వం భయపడింది. అందుచే విడుదల చేసింది.

ఇపుడు మనంచూడాలిసింది ఎందువల్ల విడుదల జరిగిందా అనికాదు. ఆయన జైలులో వున్నంతకాలం చొరవ తీసికునే అవకాశం బ్రిటీషుప్రభుత్వంచేతిలో వుండేది. విడుదలవల్ల గాంధీజీ చేతుల్లోకి ఆ అవకాశం వచ్చింది. గొప్ప జాతీయనాయకుడు. తన ప్రజలమధ్యకు వచ్చాడు. ఏమైనా చేయగలడు. చొరవ ఆయన చేతిలోవుంది.

వైస్రాయి వద్దకు వెళ్లితే ఆయన ఏమీ సాధించలేడు. ఎప్పటి మొండి సమాధానమే వస్తుంది. స్వయం నిర్ణయహక్కును అంగీకరించి జిన్నావద్దకు వెళ్ళితే హృదయపూర్వకమైన ఆహ్వానాన్ని గాంధీజీ పొందుతాడు. ఇద్దరూ కలసి హిందూ-ముస్లిం ఐక్యతను నిర్మించగలుగుతారు. నాయకులను విడుదల చేయించగలుగుతారు. జాతీయప్రభుత్వాన్ని స్థాపించగలుగుతారు. ప్రజలను ఆహార కరువునుంచి; దేశాన్ని జపాన్ దురాక్రమణదారుల నుంచి రక్షించగల్గుతారు.

ఆత్మగౌరవం దృష్టితో చూచినా, సోదర భావంతో చూచినా, స్వాతంత్ర్య దృష్టితో చూచినా, గాంధీజీ వెంటనే జిన్నాతో రాయబారాలకు పూనుకోవాలి.

ధాన్యంధర 11 రూపాయలకు పెంచాలి

కృష్ణాజిల్లా ఫుడ్‌కౌన్సిలు నిర్ణయం

కృష్ణాజిల్లా ఫుడ్‌కౌన్సిలు సమావేశం 24వ తేదీన బందరులో జిల్లాకలెక్టరాఫీసులో జరిగింది. జిల్లాకలెక్టరుగారు సెలవుమీద ఉన్నందువల్ల జిల్లాకమ్మర్షియల్ టాక్సులఫీసరుగారు అధ్యక్షత వహించారు. జిల్లాకలెక్టరుగారు నిర్ణయించిన ధాన్యం సీలింగ్‌ధరలపై అసమ్మతి చూపిస్తూ వడ్లబస్తా 1కి పదకొండురూపాయల చొప్పున ధర నిర్ణయించవలెనంటూ కృష్ణాజిల్లా రైతుసంఘం తరపున ప్రధానకార్యదర్శి కాట్రగడ్డ రాజగోపాలరావు ప్రవేశపెట్టిన మెమొరాండంపై చర్చలు జరిగాయి.

మెమొరాండం సారాంశం

కృష్ణాజిల్లా కలెక్టరుగారు 164 పౌనుల వడ్లబస్తా ధర రూ. 10-4-0. 246 పౌ. బియ్యం బస్తా ధర రు. 24—4—0 చొప్పున సీలింగ్ ధరలు నిర్ణయించారు. ఈధరల నిర్ణయంవల్ల రైతుల్లో తీవ్ర అసంతృప్తి వ్యాపించింది. కలెక్టరుగారు నిర్ణయించిన పైరేట్లవల్ల ఫ్యాక్టరీ యజమానులకూ, వర్తకులకూ లాభంగాఉంది కాని, కష్టపడి పంట పండించుతున్న రైతుకు మాత్రం న్యాయమైన ధర గిట్టుబాటు కావటంలేదు.

వడ్లబస్తా ధర రు 10-4-0 చొ॥, బియ్యం బస్తా ధర రు 24-4-0 చొప్పునా నిర్ణయించినపుడు మిల్లింగుచార్జీలు, తూనిక, కుట్టుడు మొదలైన ఖర్చులూ, సంచిఖరీదూ, సేల్సుటాక్సు, బాడుగ మొదలైనవీ కలుపుకొని, వూక, తవుడు, నూకలూ మొదలైనవాటిపై వచ్చే ఆదాయాన్ని మినహాయించి చూస్తే ఫ్యాక్టరీ యజమానికీ, మధ్యబేరగానికీ కలిపి బియ్యంబస్తా 1కి రు 2—0—0 లాభం గిడుతోంది. వర్తకులకు కల్గుతున్న ఈ లాభంలో కష్టపడి పంట పండించుతూ, రెక్కలపై ఆధారపడియున్న రైతుకుకూడ కొంతభాగం కావలెనని కోరటం న్యాయమూ, సహజమే కదా!

అంచేత రైతువద్ద కుసుమధాన్యం బస్తా 1కి రు. 11-0-0 చొ॥ కొనేటట్లు సీలింగ్ ధరలను నిర్ణయించాలి. అక్కుళ్లు, రామసాగరాలు, సన్నాలు, నెంబర్లు మొదలగు ఇతర ధాన్యాలకుకూడ యీ దామాయిషీని రేట్లు పెంచాలి. ప్రస్తుతమున్న బియ్యంధరను పెంచకుండానే వడ్లధర బస్తా 1కి రు. 11-0-0 ధర నిర్ణయించవచ్చు. బియ్యంధర పెంచకుండా ప్రస్తుతమున్న రు. 24-4-0 ధర మీదనే ఫ్యాక్టరీ యజమానికీ, మధ్యబేరగానికీ బస్తా 1కి ఒకరూపాయి లాభం గిట్టుతుంది. ఫ్యాక్టరీ యజమానులు బియ్యం బస్తాపై పెట్టుబడిపెడుతున్న యీ యిరవైమూడు రూపాయలూ సంవత్సరంలో నాల్గుసార్లయినా టర్నోవర్ అవుతాయి. అంటే రు. 23 మీద సంవత్సరానికి నాలుగురూపాయిలు లాభమన్నమాట.

ఈ యదార్ధ విషయాలను పరిశీలించిన మీదట బియ్యంధర పెంచనక్కరలేకుండానే, ప్రస్తుతమున్న ధరను ఖాయపరుస్తూ వడ్లధర మాత్రం రైతువద్ద 11 రూపాయలకు కొనేటట్లు నిర్ణయించాలి. ఈ రకంగా రైతుకు న్యాయమైన ధర గిట్టుబాటౌనట్లు చూచినచో, రైతులు తనధాన్యాన్ని మార్కెటుకు విరివిగా పంపటానికీ, ఆహారసమస్యా పరిష్కారంలో తమవంతు బాధ్యతను ఉత్సాహపూరితంగా నెరవేర్చుటకు వీలుగా ఉంటుంది. కాబట్టి ధాన్యం ధర వెంటనే పెంచాలి.

ప్రక్కనున్న గుంటూరుజిల్లాలో యీ విషయాలను గమనించే ధరలు యీమధ్య హెచ్చుచేయబడ్డాయి. గుంటూరు జిల్లాలో ధరలు హెచ్చించి, యీ జిల్లాలో హెచ్చించక పోయినచో దొంగతనంగా ఎగుమతులు జరిగి, యీజిల్లాలో బియ్యం కొరతకూడ సంభవించవచ్చు. ఇప్పటికప్పుడే నందిగామ తాలూకాలో బియ్యం దొరకటం గగనంగా వుంది. మార్కెటులో ఉన్న బియ్యమంతా దొంగ మార్కెటులోకి మాయమైపోయింది. గ్రామాల్లో ప్రజలు అనేక యిబ్బందులు పడుతున్నారు. కాబట్టి వెంటనే తగు చర్య తీసికోవాలి.

రైతుల యిబ్బందులు

"ధాన్యాన్ని కమాండీరుచేసే సందర్భంలో కూడ రైతులకు కొన్ని సదుపాయాలు కల్గించవలసి ఉంది. ధాన్యాన్ని కమాండీరు చేసినప్పుడు, రైతులకు బియ్యంగా ఆడించి యివ్వవచ్చుననే అవకాశం కల్గించినప్పటికీ యదార్ధానికి రైతులు దీని ఫలితాన్ని అనుభవించలేకపోతున్నారు. ధాన్యం కమాండీరు చేసి, చౌకధరలకు ఫ్యాక్టరీకిచ్చినచో, ఎక్కువలాభం కల్గుతుండటంవల్ల రైతులు వర్కింగ్‌చార్జీలు యిస్తామన్నప్పటికీ, అదనంగా వచ్చే లాభం పోతుందని మిల్లుయజమానులు తమ మిల్లుల్లో బియ్యం ఆడుటకంగీకరించుటలేదు. అందుచేత కమాండీర్ చేసినప్పుడు రైతులు బియ్యంగా ఆడించి యిచ్చుటకు సంసిద్ధత చూపెట్టినచో సమీపంలో ఉన్న మిల్లుల్లో రైతుల ధాన్యాన్ని ఆడించి యిచ్చు సౌకర్యం కల్గించాల"ని కూడ మెమొరాండంలో తెలియజేయబడింది.

మెమొరాండంలోగల విషయాలను బలపరుస్తూ శ్రీ కె. వి. రమణయ్యనాయుడుగారు, వట్లూరి సుబ్బారావు బి. ఏ. బి. యల్. గారు మద్దాలి తిరుమలరావుగార్లు మాట్లాడారు. కనీసం గుంటూరుజిల్లాలో హెచ్చించినట్లుగా యిక్కడ కూడ వడ్లధరలు హెచ్చించవలెనని తీర్మానం ఏకగ్రీవంగా అంగీకరించబడింది. ధాన్యాన్ని కమాండీరు చేసినపుడు రైతులు బియ్యంగా ఆడించి యివ్వదలచినచో సమీపంలోగల మిల్లుల్లో మిల్లింగ్ సౌకర్యాలు కల్గించబడునని కూడ ప్రెసిడెంటుగారు సమాధానమిచ్చారు. మిల్లుయజమాను లంగీకరించకపోతే కలెక్టరుగారికి తెలియపర్చినచో తగిన సౌకర్యం కల్గిస్తామన్నారు.

ఈ జిల్లాలోని ధాన్యాన్ని కమాండీరుచేసి ఇతరచోట్లకు ఎగుమతి చేసేటప్పుడు, ఆయా తాలూకాల స్థానికావసరాలను దృష్టిలో పెట్టుకోవాలనీ, ఈ విషయాల్లో గ్రెయిన్ పర్చేజింగ్ ఆఫీసరు జిల్లాకలెక్టరుగారితో సంప్రదించి ఎగుమతులు చేయాలిగాని, స్వతంత్రించి చేయరాదనికూడ యీ కౌన్సిలులో సూచించారు.

ఈ ఆలస్యం కూడదు

దోనేపూడి ధర్మారావుగారు ఇలా వ్రాయుచున్నారు:

"ఏదిద గ్రామంలో (తూర్పు గోదావరి జిల్లా) 500 యకరములమెరకభూమి పల్లపు సాగుకు లాయికీ అయివున్నా, రైతులు సరియైన నీటివసతిలేక సాగుచేయలేక పోతున్నారు. ఈ 500 యకరాలు కల్గిన రైతులు అధికాహారోత్పత్తి గావించాలని ఉత్సాహంతో నున్నారు. 25—8—44న రెవిన్యూశాఖకు, పబ్లిక్‌వర్క్సు డిపార్టుమెంటుకు, పిటీషన్లు పంపుకోగా, యంక్వయిరీ జరిగి, యంక్వయిరీ రిపోర్టులో సదరు 500 యకరాలు సాగుచేయుటకు అవసరమైన కాలువను త్రవ్వించుటకు సిఫార్సుచేశారు. ఈ విషయాలు సూపరింటెండెంటు ఇంజనీరుకు, జిల్లాకలెక్టరుకు కూడా తెలియజేయబడ్డాయి. కలెక్టరు కూడా యీ స్కీమును అమలులో పెట్టుటకు అంగీకరించారు. కాని కాలువ త్రవ్వుటకుగాను భూమిని కొనేవిషయంలో పేచీ బయల్దేరింది. రైతులవద్దనుండి భూమిని యకరం 1కి రు. 3000కు కొనవలసినదిగా జిల్లాకలెక్టరు చీఫ్‌యింజనీరుకు వ్రాశారు. దానిమీద చీఫ్‌ఇంజనీరు కలెక్టరుకు, రెవిన్యూబోర్డుకు యకరం 1కి రు 3000 లకు కొనుటకు గవర్నమెంటు అంగీకరించదని వ్రాశాడు. రు 1000 లకు మించిన ధరయెంతైనా రైతులే భరించేపద్ధతిని కాలువను వెంటనే త్రవ్వవచ్చుననీ, ఆలస్యమైతే త్రవ్వకం సాగదనీ కూడా తెలియజేశాడు. ఈ విషయమంతా కలెక్టరు రైతులకు తెలియబరచి, రైతుల అంగీకారమును తీసుకొని వెంటనే అధికారులకు తెలియపర్చారు. కాని యీనాటి వరకు కాలువ త్రవ్వుటకు చీఫ్‌యింజనీరు వద్దనుంచి శాంక్షన్ రాకపోవడం శోచనీయమైన విషయం. వారంరోజులలోపు శాంక్షన్ఆర్డరు రాకపోతే రైతులు చాల నష్టపడతారు. అధికాహారోత్పత్తికి యెంతో సహాయకారి అయ్యే యీ స్కీమును అమలులో పెట్టకపోతే, ఏడాదికి 10,000 బస్తాలధాన్యం పండే అవకాశం జారవిడిచినట్లవుతుంది. కాబట్టి యీ స్కీమును ప్రభుత్వం వెంటనే అమలుపెట్టి అధికాహారోత్పత్తికి, దేశరక్షణకు, సహాయపడవలసినదని కోరుచున్నాను."

రైతు వార్తలు

కొత్తపేట తాలూకా రైతుసంఘ సాధారణ సమావేశం శ్రీ ఇనుగంటి నారాయణరావుగారి అధ్యక్షతను 15-5-44 న జరిగింది. 12 గ్రామాలనుండి 25 మంది ప్రతినిధులు హాజరైనారు. సమావేశంలో యీ క్రింది తీర్మానాలు ఆమోదింపబడ్డాయి:

1. పేరవరం పంపింగుస్కీముక్రింద నిలిచిపోయిన కాలువపనిని తక్షణమే ఆరంభించి త్వరలో పూర్తిచేయుటకు రైతులు ప్రభుత్వాన్ని వత్తిడిచేయాలి. తమ సహకారంతో ప్రభుత్వం ఆపని పూర్తిచేసేలా చూడాలి.

2. నూతనంగా త్రవ్వబడ్డ వాడపాలెం కాలువ అడ్డకాలువవరకే త్రవ్వబడి ఆపుచేయబడ్డది. అడ్డకాలువ ఆవతలకూడా కాలువత్రవ్వి, 200 యకరాలు సాగులోనికి తీసుకురావలసినదిగా రైతులు ప్రభుత్వంమీద వత్తిడి చేయవలయును.

3. హైకోర్టు తీర్పులవల్ల జిరాయితీ హక్కును పోగొట్టుకొన్న యీనాందార్లకు తిరిగి ఆ హక్కును కలుగుజేయుచూ ఒక సవరణ చట్టాన్ని ప్రవేశపెట్టాలని తీర్మానించబడ్డది.

4. కరువుబాధితులకు సహాయం చేయుటకు, దేశరక్షణకు సర్వస్వాన్ని ధారపోయుచున్న సైనికులపోషణకు, అధికాహారోత్పత్తి గావించాలని రైతులను కోరుతూ, అందుకవసరమైన ధనాన్ని, సామగ్రిని సేకరించుటకు ప్రభుత్వమునకు అర్జీపెట్టి ఆందోళన చేయాలని తీర్మానించారు.

5. కరువుకాటకాలకు గురియైన యితర రాష్ట్రాల ప్రజలకు అన్నివిధాల సహాయపడాలనీ, ధాన్యాన్ని ప్రభుత్వానికి విక్రయించాలనీ, షావుకార్లు అధికలాభాలు గుంజకోకుండా ఆహారకమిటీలు స్థాపించాలనీ తీర్మానించారు.

ఇవిగాక స్థానికసమస్యలను గురించి, యితర తీర్మానాలు గావించారు. నూతన సంవత్సరానికి శ్రీనామన బావన్నగారు అధ్యక్షులుగాను, పెన్మెత్స అనంతంగారు కార్యదర్శిగాను, మరి 10 మందితో గూడిన కార్యనిర్వాహకవర్గం యెన్నుకొనబడ్డది.

రైతుల వ్యవసాయ పరికరాల కవసరమైన యినుమును యీ జిల్లాకు సప్లయిచేయటంలో చాల ఆలస్యం జరుగుతోందనీ, వెంటనే కనీసం జూన్‌నెలలోనైనా జిల్లాయొక్క అవసరాలకు సరిపడు ఇనుము సప్లయి చేయించాలనీ రాష్ట్రప్రభుత్వానికి సూచిస్త్తూ ఒక తీర్మానం ప్యాసుచేయబడింది.

చెర్లోపాలెంలో

చెర్లోపాలెం గ్రామంలో (వెంకటగిరి జమీందారీ) యీనెల 9వ తేదీ గ్రామరైతు సంఘ కార్యవర్గం సమావేశమై యీక్రింది తీర్మానాలు ఆమోదించింది:

60 సంవత్సరాలనుంచి మాగానిలోకి పశువులను మేపుకొనుటకు డొంకలేనందున చాల ఇబ్బందిగావుంది. సకాలంలో పైర్లుపండించలేక 400 పుట్ల ధాన్యంపంట నష్టపడింది. సంవత్సరానికి 9 మాసములు వందలకొలది మనుష్యులు, పశువులు అయిదు అడుగుల లోతు నీటిలో నడివాలి. ఇలా పోకపోతే వ్యవసాయం నిలిచిపోతుంది. ఈ యిబ్బందిని తొలగించుటకు 3 ఫర్లాంగులు రోడ్డు వేయమని 1927 లగాయతు బ్రహ్మాండమైన ఆందోళన చేయబడింది. ఇంతవరకు జమీందారు జోక్యంకలుగజేసుకోలేదు. 29-4-44న జరిగిన విచారణ ఫలితంగా 3 ఫర్లాంగులు రోడ్డు నిర్మించుటకు రు. 10,000 లు అంచనా వేయబడ్డది. పై మొత్తంలో కొంత ధనం రైతులు భరించడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ విషయాలను యువరాజుతో చెప్పుకొనుటకు ఒక రాయబార కమిటీని నిర్ణయించడమైనది. (మిగతా 9వ పేజీలో)

★ ఆహారసమస్య

ధాన్యపుధరల కంట్రోలు

— కడియాల గోపాలరావు

ఆంధ్రలో కృష్ణా, గోదావరి, నదులక్రింద 20 లక్షల యకరాల సారవంతమైన భూములు సాగు చేయబడుతూంది. ఈ ప్రాంతాలకు సరిహద్దు, రాయలసీమ, మలబారులకు కూడా ఎగుమతి చేస్తున్నాము. అలాంటి కృష్ణా, గుంటూరు జిల్లాలలో రెండు మాసాల్నుండి వచ్చే ఆహారరిపోర్టులు చాల ఆందోళనకు దారితీస్తున్నవి. గుంటూరు జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో బస్తా 1కి 46 రూపాయల వరకు బియ్యపు ధరలు పెరిగాయని, బెజవాడలో రు. 30 మొదలు 35 వరకు ఉన్నాయని, వార్తలువస్తున్నాయి. బెంగాలు కరువునుండి పాఠాలు నేర్చుకుంటున్న ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం 1943 మార్చిలోనే ఆహారసమస్య పరిష్కారానికి ప్రజలు పూనుకోవాలని హెచ్చరించింది.

అతి ప్రధానమైన ఈ ఆహారసమస్యా పరిష్కారమునకు ధరల కంట్రోలు విధానమవసరమని రాష్ట్రమంతటా ఆందోళన జరిగింది. పరిస్థితులు శృతిమించి రాగాన పడుతున్న ఈసమయంలో, గుంటూరు, కృష్ణా జిల్లాల కలెక్టర్లు ధాన్యపు కంట్రోలు ఆర్డర్లు ప్రకటించారు.

కంట్రోలురేట్లు ఏమిటి ?

కృష్ణా

ధాన్యం 166 పౌ॥ బస్తా 10—4—0

బియ్యం 246 పౌ॥ (సంచితోసహా) 24-4-0

గుంటూరు

ధాన్యం 166 పౌ॥ బస్తా 11-9-7

బియ్యం 246 పౌ॥ బస్తా 24-9-9

(ఫ్యాక్టరీకిచేరా, సంచి ఖరీదు, అమ్మకపన్నుతోసహా)

కంట్రోలు ప్రకటించగానే గొల్లున ఆందోళన సాగింది. వర్తకులు ఫ్యాక్టరీలు మూస్తామని బెదరించారు. కంట్రోలు పద్ధతిని సాగనివ్వకుండాచేసి స్వేచ్ఛావ్యాపారంతో దోపిడిలాభాలు గుంజి ప్రజలనుమాడ్చి, దేశాన్ని సంక్షోభంలోకీడ్వడమే వీరి ఆశయం. నిజానికి పైనిర్ణయించిన రేట్లలో మిల్లు యజమానులకే పెద్దలాభాల అవకాశం వదలబడ్డది.

మిల్లు వ్యాపారుల నినాదాలు

కంట్రోలురేటు తమకు గిట్టదంటూ ఆక్రందనలొకవైపు, బస్తా రూ. 11 రూ. 12 లకు కొని కరువుప్రాంతాలలో దొంగమార్కెటుకు బస్తా బియ్యం రూ. 30 రూ. 40 అమ్ముకొంటున్నారు మరోవైపు. రేషనింగు, కంట్రోలు విధానంవల్ల, తమ ఆట కడుతుందని వాటికి వ్యతిరేకంగా, రేషనింగు కంట్రోలువస్తే అసలే ధాన్యం దొరకదని ప్రజలను భయపెడుతున్నారు. తాము రూ. 11, 12 ధరలలో ధాన్యం కొన్నామని, కంట్రోలువల్ల తమకు నష్టం వస్తుందని మరొకగోల. ఇదే బెజవాడ వర్తకప్రముఖుడు ఆలపాటి కుటుంబరావుగారి పత్రికా ప్రకటన సారాంశం. తాము విపరీత లాభాలకోసం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుటకు కొన్నారా హెచ్చు ధరలకు? ఒకవైపున సంవత్సరంనుండి ప్రభుత్వం బస్తా 24-4-0 కు బియ్యం, 10-6-0 కు ధాన్యం కొంటున్నప్పుడు వీరిలా పెంచడంలో అర్థమేమిటి? నష్టలాభాలకు బాధ్యులెవరు?

వర్తకుల ఈవింతవైఖరినే కొన్నిజాతీయ పత్రికలు సహితం సమర్థించుట కడు శోచనీయం. 'రైతులకు నాలుగుడబ్బులు రాగూడదా' అంటూ ధాన్యపుధరల కంట్రోలును వ్యతిరేకిస్తున్నారు. ధాన్యంకు ధరల కంట్రోలు వద్దంటే బియ్యపు కంట్రోలు ఆర్డరుకు తూట్లుపొడిచి దొంగవ్యాపారం ప్రోత్సహించడమేగాని వేరుగాదు. రాష్ట్రరైతుసంఘం ప్రజలక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొనే ధాన్యపు బస్తా రు. 11-0-0 ఉండాలని తీర్మానించింది

12 రూపాయల నినాదంలోని ప్రమాదము

కొంతమంది ప్రముఖులు రైతుసంఘాల పేరుతో రైతుల్లో సహజంగా ధాన్యంధర ఎక్కువకావాలనిఉండే అభిప్రాయాన్ని ఉపయోగించాకొని, చౌకగా రైతుల్లో పలుకుబడి సంపాదించటంకోసం బస్తా 1కి రు. 12-0-0 కంట్రోలుకావాలని కేకలువేస్తున్నారు. రు 12—0—0 ధరవచ్చేవరకు ధాన్యం అమ్మవద్దని కూడ ప్రచారంచేస్తున్నారు. కరువుకాటకాలతో దేశం తల్లడిల్లుతున్న సమయంలో, ఆహారపదార్ధాలు దొరకక వేలకొద్ది ప్రజలు ప్రాణాలు కోల్పోతున్న సమయంలో, ధాన్యంఅమ్మవద్దని ప్రచారంచేయటం ఎంతటి ప్రమాదమో మనం ఊహించవచ్చు. మన దగ్గర మిగిలివున్న అదనపుధాన్యాన్ని అమ్మటంలో ఒక్కరోజు ఆలస్యంచేసినా, తిండిలేక బాధపడుతున్న వేలాదిప్రజలు మృత్యువాతపడవలసివస్తుంది. అంచేత 12 రూపాయలధర వచ్చేవరకు ధాన్యం అమ్మవద్దనడం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటమే అవుతుంది. ఇంతేకాక రైతుకు కావాల్సిన వస్తువుల ధరలన్నీ విపరీతంగా పెరిగిపోయాయి కాబట్టి ధాన్యం ధరలను కూడ అలాగే పెంచవలెనని ఈ ప్రముఖులు వాదిస్తున్నారు. ఇతర వస్తువులధరలు పెరిగినవంటూ, ప్రతినిత్యం కావలసిన ఆహారపదార్ధాలతో ముడిపెట్టడం దేశానికేమాత్రమూ శ్రేయస్కరం కాదు. ఆహారపదార్ధాల ధరలు అధికంగా పెంచినట్లయితే అనేకమంది బీదప్రజలు అల్లాడవలసివస్తుంది. అంచేత మనం బియ్యంధర పెంచకుండానే ధాన్యానికి రావలసిన న్యాయమైన ధరను రాబట్టుకోటానికై కృషిచేయాలి. రైతాంగానికి కావలసిన ఇతరవస్తువుల ధరల కంట్రోలును అమలుపర్చుటకు ప్రజాసహకారంతో పోరాడాలి.

ఎవరికి లాభదాయకము ?

కృష్ణా

2 మణుగుల ధాన్యంబస్తా రు. 10-4-0 లకు కొని 246 పౌనుల బియ్యపుబస్తా (సంచితో సహా) రు. 24-4-0 లకు అమ్మితే వర్తకునకు వచ్చే లాభమెంత ?

2 బస్తాల ధాన్యం ఖరీదు	20	8	0
బియ్యం చేయడానికి	0	12	0
మిల్లుకు తోలటం	0	8	0
కాటా, కుట్టుడు వగైరా	0	2	0
కమీషన్ ఏజంటుకు	0	2	0
సంచి ఖరీదు	0	6	0
సేల్సుటాక్సు	0	4	0
రైలుస్టేషనుకు బండితోలుటకు	0	1	0
మిల్లు యజమాని పెట్టుబడి	22	11	0
ఈ పెట్టుబడికి మిల్లు యజమానికి బియ్యము, నూకలు, తవుడు, రూపంలో వచ్చు ఆదాయము (బస్తా రెండుశేర్లు దిగుబడి)	24	11	6
పెట్టుబడి	22	11	0
బస్తా 1కి లాభము	2	0	6

గుంటూరు

ధాన్యం 166 పౌ॥	11	9	7
బియ్యం	24	9	9
2 బస్తాల ధాన్యం (యీమొత్తములోనే) సేల్సుటాక్సు, బండిబాడుగ, సంచి ఖరీదు కూడా కలిసి వున్నది	23	3	2
బియ్యము చేయడానికి	0	12	0
కాటా, కుట్టుడువగైరా	0	2	0
స్టేషనుకు బండిబాడుగ	0	1	0
మిల్లుయజమాని పెట్టుబడి	24	2	2
ఈ పెట్టుబడికి మిల్లు యజమానికి బియ్యం, నూకలు, తవుడు ద్వారావచ్చు ఆదాయం	25	1	3
ధాన్యంద్వారా వచ్చిన 2 సంచులలో ఒక సంచి బియ్యమునకు పోగా మిగిలిన సంచి ఖరీదు	0	6	0
మొత్తం ఆదాయం	25	7	3
మొత్తం పెట్టుబడి	24	2	2
లాభము	1	5	1

చిల్లరగా అమ్ముకుంటే లాభం

పై లెక్కలనుబట్టి ప్రభుత్వం నిర్ణయించిన రేట్లను అనుసరించి మిల్లు యజమానులకు ప్రతి బియ్యపు బస్తాకు 1-5-0 మొదలు 2-0-6 వరకు లాభము గిట్టుచున్నది. రైతులకు ధాన్యపు బస్తా కృష్ణాలో 10-4-0, గుంటూరులో రు 10-13-0 లు గిడుతూ వున్నది. ప్రతి బియ్యపు బస్తాకు మిల్లు యజమానులకు యింత లాభము వచ్చుచున్నప్పటికి తమకు యీధరలు గిట్టలేదని ఆందోళన చేయుచున్నారు. నిజమే. బియ్యపుబస్తా 1కి రు 30—0—0 లు చొ॥న అమ్మినపుడు వచ్చే లాభమునుబట్టి పోల్చిచూస్తే ఇది స్వల్పమే!

రాష్ట్రరైతుసంఘ తీర్మానము ననుసరించి 166 పౌ॥ బస్తా 1కి రు 11—0—0 లు రైతుకిస్తే మిల్లుయజమానికి ఎంతలాభంఉంటుందో చూద్దాము.

2 బస్తాల ధాన్యంఖరీదు	22—0—0
బియ్యం చేయడానికి	0—12—0
బియ్యం తోలటం	0—8—0
కాటాకుట్టుకు	0—2—0
కమీషను ఏజంటు	0—2—0
సేల్సుటాక్సు	0—4—0
రైలుస్టేషనుకు బండితోలుడు	0—1—0
గోనెసంచి	0—6—0
(రెండుబస్తాల ధాన్యం బియ్యం చేస్తే పెట్టాల్సిన పెట్టుబడి)	24—3—0
దిగుబడి 1 బస్తా 2 శేర్లబియ్యం తవుడు నూకలు కలిసి ఖరీదు.	24-11-6
ఫ్యాక్టరీయజమాని పెట్టుబడి	24—3—0
ఫ్యాక్టరీయజమాని లాభం	0—8—6
(చిల్లరఅమ్మకం గూడా చేస్తే అదనపు లాభం)	0—12—0

166 పౌ॥ బస్తా రు 11-0-0 లు ధరవుండాలి

ధాన్యపుధర కంట్రోలులో రైతుకు బస్తా 1కి 11—0—0 లు గ్రామములోనే గిట్టునట్లుగా నిర్ణయించాలి. రైతుకూడా సంతోషముగా తన అదనపుధాన్యమును యిచ్చుటకు ముందుకువస్తాడు. అన్ని జిల్లాలలో, అన్నిగ్రామాలలో, ఈధరయే నిర్ణయించాలి. ప్రజాసామాన్యమంతటిమీద అమలుజరిపే పద్ధతులు సులభంగా చిక్కులు లేకుండా ఉండాలి.

గోనెసంచుల సప్లయి రైతు బాధ్యతకాదు

గుంటూరు ధరలు నిర్ణయించినట్లుగా సేల్సుటాక్సు, సంచిఖరీదు, బండిబాడుగలు అన్నీ కలిపి నిర్ణయించరాదు. ఇలా నిర్ణయించే యెడల రైతులకంటె లోకజ్ఞానము కలిగిన మిల్లుయజమానులు, కమీషను యేజంట్లు, అమ్మకంలో అమాయకరైతులను మోసం చేయుటకువీలుంటుంది. సంచితోసహా ధాన్యం యివ్వడము రైతుకు అసాధ్యమైనపని. రైతులకు సంచులు సరియైనధరలకు మార్కెటులో దొరుకుట కష్టము. సంచులధరలు దినదినము మారుతుంటాయి. అందుచే ధాన్యమును, రైతుసంచితో యివ్వవలెననే నిర్ణయము తీసివేయాలి.

చిల్లర అమ్మకాలు

ధాన్యంగాని, - బియ్యముగాని ప్రభుత్వము నిర్ణయించిన మిల్లురేట్లకుమించి యెంతమంది చేతులుమారినా ధాన్యమునకు మణుగు 1కి 0-3-0 లు, బియ్యమునకు మ 1కి 0-4-0 కు మించి లాభము తీయరాదు. ఇదిగాక కుట్టు, కాటా మొదలగువాటికి 0—1—0, సేలుటాక్సు, యదార్ధముగా అయిన బండిబాడుగ కలుపవచ్చును.

మిల్లు యజమానివద్ద సంచులు తీసికొనకుండా బియ్యము కొనేయెడల సంచి ఖరీదు, రైల్వేస్టేషనుకు బండిబాడుగ, కుట్టుకూలి మినహాయించుకొనవలెను. అనగా రు. 24—4—0 లో రు. 0—7—3 మినహాయించాలి.

కంట్రోల్ అమలుజరిపి ఆహార సమస్య పరిష్కరించాలంటే

ప్రజా సహకారంలేనిదే ప్రభుత్వం ఈ సమస్యను పరిష్క- (మిగతా 8వ పేజీలో)

★ చైనాలో

కమ్యూనిస్టు-కొమింటాంగ్ పక్షాల సంబంధాలు

[అమెరికాసంయుక్తరాష్ట్ర ఉపాధ్యక్షుడు హెన్రీవాలెస్ చైనాకు ప్రయాణమై వెళ్ళాడు. "ఉత్తరోత్తరా మనదేశ శాంతి అభ్యుదయాలకు అతి ప్రధానమైన ఒకానొక యుద్ధప్రదేశాన్నిగురించిన సమాచారం సేకరించడానికి" అతణ్ణి పంపానని ప్రెసిడెంటు రూజ్‌వెల్టు అన్నాడు.

"నెమ్మదిగా, నిదానంగా, చైనాలో పరిస్థితులు విషమించాయి. అమెరికా సంయుక్తరాష్ట్ర ఉపాధ్యక్షుడు హెన్రీ వాలెస్ యొక్క చంకింగ్ ప్రయాణం యీ విషమస్థితికి బహిరంగ చిహ్నం," అని వ్రాస్తాడు 'సన్‌డే డిస్పాచ్' యుద్ధసమీక్షకుడు పాల్‌రెంకర్ "చైనా యుద్ధంలో నిలవగలదా?" అనే శీర్షిక క్రింద. "శత్రువు చీనాలోనే అంతఃకలహాలు కల్పించి, వారిలోవారికే పోట్లాటపెడుతున్నాడు.... చీనా కమ్యూనిస్టులా కలిసిరావడంలేదు," అని కృష్ణాపత్రిక వ్రాస్తోంది." ప్రస్తుతం కమ్యూనిస్టు ప్రతినిధి మార్షల్ చియాంగ్-కై-షేక్‌తో సంప్రదింపులు జరుపుతున్నారు. ప్రధమ సంభాషణలు సంతృప్తికరంగా ఉన్నాయని వార్త." అంటూ చంకింగులోని రాయిటర్ ప్రత్యేక విలేఖరి వ్రాస్తున్నాడు.

ఈ ప్రపంచ ఫాసిస్టు వ్యతిరేక సంగ్రామంలో మనవంతు జపాన్ ఫాసిజాన్ని నాశనంచేయటం. యూరప్‌లో హిట్లరును నాశనంచేయడానికి సోవియట్ రెడ్‌ఆర్మీ ఉంది. మనకు అలాంటి రెడార్మీ లేదు. కాబట్టి చైనా, మనమూ చేతులు గలపడమే జపాను ఫాసిజాన్ని నాశనంచేయడానికి మార్గం. ఇలా మన స్వాతంత్ర్య యుద్ధంలో తోడునీడయైన చైనా మార్గదర్శకంగా జపాన్ వ్యతిరేక జాతీయైక్యతను సాధించింది. ఏడేండ్లు శత్రువును ప్రతిఘటించి నిల్చిన చైనా ఐక్య సంఘటనాశక్తి ఈరోజున సన్నగిలుతోందని వార్త. ఇది మనకు విషాదవార్త. కారణం మన భవితవ్యం చైనాతో ముడివడిఉంది. కాబట్టి మనవి చైనా ఐక్యసంఘటన చరిత్ర, ప్రస్తుత పరిస్థితి, ముందు పర్యవసానం, తెలుసుకోవాలి.]

చైనా జాతీయైక్యసంఘటనకు పునాది. కొమింటాంగు - కమ్యూనిస్టుపార్టీల ఐక్యత. కొమింటాంగు మన కాంగ్రెసు మాదిరి చైనాజాతీయసంస్థ. చైనా ఆధునిక అర్థిక పారిశ్రామికాభివృద్ధిని అరికట్టుతూన్న విదేశ పెట్టుబడిదారీవర్గ ప్రాబల్యాన్ని, దేశీయ జమిందారీవిధానాన్ని, నాశనంచేసి, ప్రజాతంత్ర పరిపాలనను నెలకొల్పడం కొమింటాంగు ఆశయం. డాక్టర్ సన్‌యెట్‌సేన్ ఈ కొమింటాంగుకు జన్మదాత.

చైనా కమ్యూనిస్టుపార్టీ 1921లో స్థాపించబడ్డది. ప్రపంచంలో అన్ని కమ్యూనిస్టుపార్టీలకువలెనే, చైనా కమ్యూనిస్టుపార్టీకి గూడ అంతిమఆదర్శం కమ్యూనిజమైనా, 1921 నాటికి కొమింటాంగు ఆశయమే, తనకు గూడ సత్వరఆశయమయింది. కమ్యూనిజానికి ముందు ప్రజాతంత్రవిప్లవం సాధించడం అవసరం. అంటే భూస్వామ్య విధానాన్ని, విదేశ పెట్టుబడిదారీవర్గ దోపిడీనీ, అంతంచేయాలి. చైనా పరిశ్రమలను అభివృద్ధిచేయాలి.

ఈ రెండుపార్టీల ఆశయాలూ నెరవేరాలంటే, "చైనా నిజంగా స్వతంత్రం, ప్రజాతంత్రం అనుభవించాలంటే, యీ రెండుపార్టీలూ కలిసి ఐక్యతతో పోరాడాలని చైనా జాతీయ విప్లవోద్యమ పితామహుడు సన్‌యట్‌సేన్ గ్రహించాడు."

(ఎప్‌స్టన్ 'ది పీపుల్సువార్' పేజి 11)

1923లో కొమింటాంగు కమ్యూనిస్టుపార్టీలకు ఐక్యత కుదిరింది. కమ్యూనిస్టుపార్టీ సభ్యులు కొమింటాంగులో వ్యక్తిగతంగా చేరవచ్చును. కొమింటాంగు శిక్షణకు లోబడాలి. అయితే కమ్యూనిస్టుపార్టీకి నిర్మాణస్వాతంత్ర్యం ఉంటుంది.

మూడు ప్రజాసూత్రాలు

జాతీయత; ప్రజాపరిపాలన; ప్రజల ఆర్థికజీవనం; యివి మూడూ సన్‌యట్‌సేన్ యొక్క మూడు ప్రజాసూత్రాలు. ఈసూత్రాల పునాదిపైనే 1923లో కమ్యూనిస్టు కొమింటాంగు ఐక్యతకుదిరింది. ఈమూడుసూత్రాలకూఅర్థం, స్వాతంత్ర్యం, ప్రజాతంత్రం, భూమిని సమానంగా పంచిపెట్టడంద్వారానూ, పరిశ్రమలు వృద్ధిజేయడంద్వారానూ ప్రజలకు సుఖకరమైన అర్థికజీవనం కల్పించటం.

ఈ కార్యక్రమంతో చైనా ప్రజలంతా స్వతంత్రమంటే ప్రజాతంత్ర పౌరసత్వహక్కులూ, స్వేచ్ఛాజీవనం సుఖజీవనం అని అర్థంచేసుకున్నారు. ఈ కార్యక్రమ విజయం కొరకు కమ్యూనిస్టు కొమింటాంగు ఐక్యతా పతాకంక్రింద ఎన్నడూ లేనంతగా ప్రజలు సమీకరింపబడ్డారు. వ్యవసాయ విప్లవం దిగ్విజయంగా సాగిపోతోంది. "ఈ భూమిమాది" అనే ప్రజా నినాదం మిన్నుముట్టింది.

విచ్ఛిన్నం

ఇంతలో డాక్టరు సన్‌యట్‌సేను చనిపోయాడు. (1925 మార్చి 12.) చియాంగ్-కే-షేక్, కొమింటాంగుకు నాయకుడైనాడు. భూస్వామ్య ధనికవర్గాల కూటమికి ప్రాబల్యం హెచ్చింది. కొమింటాంగు కార్మిక-కర్షకుల సాయం విడనాడింది. సన్‌యట్‌సేను చెప్పిన భూమిపంపక విధానాన్ని కొమింటాంగు ప్రభుత్వం వ్యతిరేకించింది. 1927 లో వేలకొలది కమ్యూనిస్టులను తన కరకుకత్తికి బలి తీసుకుంది.

అప్పటినుంచీ పదియేళ్ళగ చైనాగాధ మరపురాని విషాదగాధ. చియాంగ్-కే-షేకు చైనా కమ్యూనిస్టు పురుగు నామరూపాలులేకుండా తుడిచేస్తానన్నాడు. నిషేధాలు,

పి. వి. శివయ్య

నిర్బంధాలు, అరెస్టులు, కాల్పులు నిత్య కార్యక్రమం. కమ్యూనిస్టులు అందకుండా దూరపు దేశాలకు విరమించారు. 1930 మే నెలకి, కామ్రేడ్స్ చూటే, మాసేడంగ్ మొదలైనవారి నాయకత్వాన 62000 ఎర్రసైన్యం తయారైంది, మూడు ప్రజాసూత్రాలనూ ముక్కుకుముక్కా అమలుపరచే సోవియట్ ప్రభుత్వాన్ని పందొమ్మిదిజిల్లాలలో స్థాపించారు.

చియాంగ్-కే-షేకు తన "కమ్యూనిస్టు మారణ కార్యక్రమం"తో సోవియట్ జిల్లాలపై ఐదు మహాదండయాత్రలు సాగించాడు. చివరదండయాత్రలో 5 లక్షల సైన్యాలనూ, నౌకలనూ, విమానాలనూ ఉపయోగించాడు. జర్మన్ సలహాదారుడైన వార్‌సీక్టు ప్లానువేశాడు. కమ్యూనిస్టులు నాశనం కాలేదు. ప్రజాతంత్ర విప్లవ కార్యక్రమం కొనసాగిస్తూ గొప్ప ప్రజాశక్తిగా మారారు.

మరల ఐక్యతా ఉద్యమం

1931 సెప్టెంబరు 18 వ తేదీన జపాను మంచూరియాపైన దండయాత్ర చేసింది. "రాబోయే యుద్ధం ప్రపంచ పెత్తనం కొరకు పోరాటం. మంచూరియా దండయాత్ర దానికి ప్రారంభంమాత్రమే," అని అన్నాలూయీ స్ట్రాంగ్, ('చైనా స్వతంత్ర పోరాటం.') "జపాన్ మిలిటరీ యంత్రం యుద్ధంకొరకు నిర్మించబడ్డది. యుద్ధానికి తయారీ పూర్తయిందని తలుస్తూ ఉంది; యుద్ధాన్ని ఆహ్వానిస్తూన్నది" అని జోసెఫ్‌గ్రూ, (జపానులో అమెరికా రాయబారి) అన్నారు. జపాను ప్రపంచ ప్రజలపై ఫాసిస్టు దండయాత్రకు నాంది వేసింది.

చైనాకూ, ప్రపంచప్రజలకూ, సంభవించిన యీ కొత్త అపాయాన్ని ఎదుర్కోవాలి. చైనాలో ఐక్యత అవసరం. చైనా కమ్యూనిస్టుపార్టీ కామ్రేడ్ మాసెడంగ్ నాయకత్వాన 1932 జనవరిలో "చైనా జాతీయస్వాతంత్ర్య రక్షణకొరకు, జపాను సామ్రాజ్యవాదంపైన, సాయుధులైన ప్రజలు జాతీయ విప్లవయుద్ధం సాగించాలని" ప్రజలను హెచ్చరించింది. 1932 ఏప్రిల్‌లో తనంతటతానే చైనా సోవియటు ప్రభుత్వం జపానుపై యుద్ధాన్ని ప్రకటించింది.

కొమింటాంగు సైన్యంతో సహకారం అపేక్షించింది. ఇలాంటి సహకారానికి మూడు షరతులు పెట్టింది. 1. సోవియట్‌జిల్లాల పైన దండయాత్రలు కట్టిపెట్టాలి. 2. ప్రజలకు ప్రజాతంత్ర హక్కుల నివ్వాలి. 3. జపాను వ్యతిరేక వాలంటీరుదళాలను నిర్మించనీయాలి—అంటే ప్రజలకు ఆయుధాలీయాలి.

కాని వాంగ్-చింగ్-వీ (అప్పటి ప్రధానమంత్రి) నాయకత్వాన కొమింటాంగు ప్రభుత్వం కమ్యూనిస్టులపైన దండయాత్రలు చేస్తూన్నది. ఈ దండయాత్రలకు జపానుప్రోద్బలం ఎడతెగకుండా ఉంది. కొత్తగా వచ్చిన జపాను ప్రమాదాన్ని గుర్తించిన చైనాప్రజలు ఈ అంతర్యుద్ధ ప్రమాదాన్ని అసహ్యించుకున్నారు. చివరకు కమ్యూనిస్టులపై పంపబడ్డ 19 వ సైన్యం ప్రభుత్వానికెదురుతిరిగి ఫూకిన్ రాష్ట్రంలో స్వతంత్ర ప్రభుత్వాన్ని నెలకొల్పింది. ఈ స్వతంత్ర ప్రభుత్వం కొద్దిలో పడిపోయినా, దాని సత్సంప్రదాయాలను నిలబెట్టుకుంది. తరువాత జపానును ప్రతిఘటించి నిలిచింది.

అంతర్యుద్ధానికి అంతులేదు. ఉత్తర చైనాకు జపాను ప్రమాదం యెక్కువైంది. నేరుగా జపానును ఎదుర్కోవాలి. అందుకొరకు కియాంగ్సీ సోవియటు రాష్ట్రంనుంచి, చైనా ప్రభుత్వం కట్టుతూన్న దుర్గశ్రేణులను తప్పించుకుని, ఉత్తర చైనాలోని షెన్సీకి కమ్యూనిస్టు సైన్యాలూ, ప్రభుత్వమూ ప్రయాణమైనాయి. కొమింటాంగ్ ప్రభుత్వసైన్యాలతో అసంఖ్యాకయుద్ధాలు చేస్తూ, యాంగ్‌ట్జే హోయాంగ్‌హోల లాంటి 20 పెద్దనదులనూ ప్రపంచంలోకల్లా ఎక్కువ ఎత్తయిన మంచుపర్వతాలనూ, దట్టమైన అడవులనూదాటి, 12 రాష్ట్రాలగుండా 6000 మైళ్లు, మోయగలిగిన యంత్రసామగ్రిని గూడా మోసుకునిపోయారు. ఈ మహాప్రస్థానంతో చైనా అంతా జపాను వ్యతిరేకక్రోధంతో ఉడికిపోయింది. జాతీయ ఐక్యతాభిమానం మిన్నుముట్టింది. 'చైనీయుడు చైనీయుడిపై పోరాడగూడదు.' అనే నినాదం మార్మోగింది.

1934 ఆగస్టు 2వ తేదీని చైనాలో అనేకవ్యాపారాలకూ, వ్యాసంగాలకూ, చెందిన 3000 మంది ప్రముఖవ్యక్తులు సన్‌యట్‌సేన్ సతి నాయకత్వాన ప్రభుత్వంవద్దకు రాయబారం వెళ్లారు. అంతర్యుద్ధాన్ని ఆపమనీ, చైనాప్రజల జపాను వ్యతిరేకయుద్ధంలో అన్నిశక్తులనూ సమీకరించాలనీ ప్రజలందరికీ ఆయుధాలివ్వాలనీ, జపానుయొక్క వ్యాపారసంస్థలను, మరి యితరసంస్థలను, వశంచేసుకోవాలనీ చైనా నేషనల్ కౌన్సిలు ఎన్నుకోబడాలనీ, జపానును వ్యతిరేకించే వారందరితో చేతులుకలపాలనీ కోరారు. ప్రజాభిప్రాయానికి తట్టుకోలేక ప్రాణాలు దక్కించుకుని 1935 నవంబరులో వాంగ్ చింగ్ వీ యూరప్‌వెళ్లాడు. చియాంగ్-కే-షేకు చైనాకు సర్వసైన్యాధ్యక్షుడే కాక, అధ్యక్షుడు కూడా ఐనాడు.

ఐక్యతకోసం ప్రయత్నం

ఉత్తరచైనా సోవియట్లపై దాడిచేయడానికి మార్షల్ చాంగ్ సు లియాంగ్ నాయకత్వాన మంచూరియా సైన్యాలు పంపబడ్డాయి. కాని అతడూ, అతని సైన్యాలూ, జపానును ప్రతిఘటించడానికి కమ్యూనిస్టులతో చేతులు కలిపారు. అతనిని మందలించడానికి చియాంగ్-కే-షేకు సియాన్ వెళ్ళాడు. ఈయన మందలింపులకు ఎవరూ లెక్కచేయలేదు. పైగా, అతనిని అరెస్టుచేశారు. జపానుదండయాత్రను ప్రతిఘటించడానికి అంగీకరించకపోతే చంపుతామని బెదరించారు.

(6 వ పేజీ తరువాత)

కమ్యూనిస్టు నాయకుడు కామ్రేడ్ చు ఎన్‌లాయ్ అక్కడే ఉంటం తటస్థించింది. చియాంగ్-కే-షేక్ చైనాజాతీయైక్యతా నిర్మాణంలో ప్రముఖపాత్ర వహించవలసినవాడు, అతణ్ణిచంపితే జాతి ఎన్నటికీ ఏకం కావటానికి వీల్లేని పరిస్థితులేర్పడి, జపానుకువీలుచిక్కుతుంది. కాబట్టి అతన్ని వెంటనే విడుదలచేయాలని గట్టిగా సలహా యిచ్చారు.

చియాంగ్ విడుదలైనాడు. తన అరెస్టు, విడుదలలో కమ్యూనిస్టులపాత్ర, చాంగ్ సూ లియాంగ్‌యొక్క జపాను వ్యతిరేక ప్రతిఘటనయందలి ఆసక్తి, ఒక కలగా నడిచినై: హృదయంపైన హత్తుకున్నాయి. ప్రజల ఒత్తిడి గెల్చింది. 1937 జులై 7 న జపాను చైనాపై దండయాత్ర ప్రారంభించింది. సెప్టెంబరు 23 న కొమింటాంగు—కమ్యూనిస్టు పార్టీలకు ఐక్యత కుదిరింది.

చైనా చరిత్రలో అది సువర్ణాక్షరాలతో లిఖింపదగింది. ఐక్య చైనాకు చియాంగ్ అద్వితీయనాయకుడు. సన్‌యట్‌సేను "ప్రజా సూత్రాలు" చైనా ఐక్యసంఘటనకు రక్తమాంసాలు; జపాను వ్యతిరేక జాతీయ ప్రతిఘటన దానికి ప్రాణం.

సన్‌యట్‌సేన్‌సతి మొదట స్వాగతమిచ్చింది, "చైనా ఉనికికి సంయుక్తపోరాటమే సూత్రమని డాక్టరు సన్ జీవితపర్యంతమూనమ్మాడు. అందువల్లనే ఆయన కమ్యూనిస్టులూ, కొమింటాంగు కలిసిపనిచేయాలన్నాడు.....ప్రస్తుత సంక్షోభంలో పాత అభిప్రాయభేదాలు మరచిపోవాలి. జపాను దురాక్రమణను ఎదుర్కోడానికి, అంతిమవిజయం చేకూర్చడానికి, జాతిఅంతా ఒక్కటి కావాలి" అని అంది.

ఫలితం

1937లో ఏర్పడిన కమ్యూనిస్టు—కొమింటాంగు పార్టీల ఐక్యత 1938 ఆఖరువరకూ అవిచ్ఛిన్నంగా కొనసాగింది. 1939 నుండి విచ్ఛిన్నకారణాలేర్పడ్డాయి. ఈ రోజున అతిబలహీనంగా ఉంది. దీనికి కారణమేమిటి?

కమ్యూనిస్టుపార్టీ యీ క్రింది షర్తులకు కట్టుబడి ఉంటుందని, ఐక్యత కుదిరినప్పుడు ప్రకటించింది.

1. ప్రస్తుతసమయంలో చైనాకు అత్యవసరమైన డా॥ సన్‌యట్‌సేన్ "మూడు ప్రజాసూత్రాలను సాధించడానికి మాపార్టీకృషిచేయ కోరుతోంది."

2. కొమింటాంగు ప్రభుత్వాన్ని కూలదోయటానికి తిరుగుబాట్లను నడపాలన్న విధానాన్ని వదిలేస్తాం. సోవియట్ విధానాన్ని నెలకొల్పే ఉద్యమాన్ని ఆపివేస్తాము. జమీలను బలవంతంగా స్వాధీనపరచుకొనే విధానాన్ని ఆపివేస్తాము.

3. ప్రస్తుతపు సోవియట్ ప్రభుత్వాన్ని రద్దుచేసి, ప్రజాతంత్రపాలనను నెలకొల్పుతాము. తద్వారా దేశమంతటా ఒకేరకమైన పరిపాలను ఏర్పరుస్తాము.

4. ఎర్రసైన్యమనే పేరునూ, అపై నికదళాలకు గుర్తులుగా ఉండే సంఖ్యలనూ రద్దుచేస్తూ, జాతీయప్రభుత్వంయొక్క మిలిటరీకౌన్సిలుకు లోబడియుండే ప్రజావిప్లవ సైన్యాలను నిర్మించి, జపాను దండయాత్రాపరులపైకి పోయి యుద్ధం చేస్తాం."

(చైనా కమ్యూనిస్టుపార్టీ విజ్ఞప్తి: సెప్టెంబరు 22, 1937)

ఈ విజ్ఞప్తికి జవాబుగా చియాంగ్ ఒక ప్రకటనచేశాడు. "మూడు ప్రజాసూత్రాలను అనుసరించే పౌరులందరికీ, వారివారి నమ్మకాలేమైనాసరే జాతీయతనిస్తుంది.......ఇదే మాదిరిగా కొమింటాంగు నాయకత్వంక్రిందికి రాకోరిన అన్ని పార్టీలసహకారాన్ని జాతీయప్రభుత్వం సంతోషంగా స్వీకరిస్తుంది."

చియాంగ్-కే-షేక్ చెప్పిన ప్రకారం మూడు షర్తులను నెరవేర్చాలి. 1. చైనా జాతీయ స్వాతంత్ర్యంకొరకు జపాను

అనైక్యతకు కారకులు ఎవరు

వ్యతిరేక స్వాతంత్ర్య యుద్ధాన్ని సాగించాలి. 2. చైనాలో ప్రజాతంత్ర ప్రభుత్వం నెలకొల్పాలి. 3. ప్రజల ఆర్థిక జీవనాన్ని అభివృద్ధిచేయాలి.

కమ్యూనిస్టుపార్టీ తను తీసుకున్న బాధ్యతలను నెరవేర్చింది. రెడ్‌ఆర్మీ పేరును రద్దుచేసింది. సోవియట్లను రద్దుచేసింది. జమీలను బలవంతంగా స్వాధీనం చేసుకోటం మానేసింది. కొమింటాంగు ప్రభుత్వ అధికారాలన్నీ అంగీకరించింది. పూర్వం సోవియట్ ప్రదేశాలను షెన్సీ-కన్సు-నింగ్షా సరిహద్దురాష్ట్రం అనే పేరుతో ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పరచి, మూడు మూడువంతుల సూత్రాన్ని (ప్రభుత్వంలో మూడోవంతు కమ్యూనిస్టులు, మూడోవంతు కొమింటాంగు సభ్యులు, మిగతా మూడోవంతు ఏ పార్టీకి చెందనివారూ ఉంటారు) అమలు పరచింది. ఈ ప్రత్యేక రాష్ట్రంలో ప్రజల ఆర్థికజీవనం స్వయంపోషకంగా అభివృద్ధిచేసింది. ఇలాగే జపాను దాస్యంనుంచి విడిపించిన ప్రదేశాలనుగూడ తయారుచేసింది.

కమ్యూనిస్టులు ఐక్యసంఘటనను హృదయపూర్వకంగా ఆచరణలో పెట్టారు. "చైనాను యుద్ధకాలంలో రక్షించడమేగాదు, విజయానంతరం జాతీయ పునర్నిర్మాణంలో గూడా కొమింటాంగుతోకలిసి పొరపులేకుండా సహకారం చేయడంగూడా" తన ఆశయమని కమ్యూనిస్టుపార్టీ ప్రకటించింది.

కొమింటాంగు తన కర్తవ్యాన్ని నెరవేర్చిందా? లేదనే చెప్పాలి. మొదట రెండేళ్ల-అంటే ఐక్యత కుదిరిన 1937 నుంచీ 1939 ఆఖరువరకూ దేశంలో ఉత్సాహం ఎక్కువగా ఉంది. జపాను వ్యతిరేక ప్రతిఘటన ఎక్కువబాగా సాగింది. కారణం - చియాంగ్-కె-షేక్ ప్రజాతంత్రం అమలు జరుప ప్రయత్నించాడు. ప్రజల ఆర్థికజీవనం బాగుపరుప ప్రయత్నం జరిగింది. నామమాత్రంగానైనా కమ్యూనిస్టు ప్రతినిధులనుగూడ కలిగియున్న ప్రజారాజకీయ సభను ఏర్పరచారు. చైనా పారిశ్రామిక సహకార సంస్థలను నెలకొల్పాడు. దీనివల్ల ప్రజలలో ప్రతిఘటనాశక్తి ఎక్కువైంది. కాని 1939 తరువాత ఐక్యసంఘటన బలహీనపడజొచ్చింది. చైనా ప్రతిఘటనోద్యమంలో నిస్తబ్దత ఏర్పడ్డది. "లోపల నుంచీ, బయటనుంచీ సంభవించిన కొన్ని చిక్కులవల్ల, వెనుక దిగబడిపోయిన వాంగ్‌చింగ్‌వీ (జపాను కీలుబొమ్మగా మారిన తను) సంబంధీకులు దేశంలో అనైక్యతను పెంచారు. ప్రజలను భయపెట్టడానికి నిస్పృహ వ్యాపింపజేశారు. కొమింటాంగులోని అభివృద్ధినిరోధకులూ, కరుడుగట్టిన ముఠాలూ తమ కమ్యూనిస్టు వ్యతిరేకతను కొనసాగించారు. జాతీయ సంఘటన అంటే వివిధ ముఠాలు, వర్గాలూ, పార్టీలూ, పరస్పరం సహాయం చేసుకుంటూ ఉత్సాహం పర్చుకుంటూ, ప్రజానీకాన్నంతటినీ విజయం కొరకు సమీకరించడం అని అర్థంచేసుకోలేదు. జాతీయ సంఘటన అంటే కొమింటాంగు మితవాద అధికారవర్గానికి దాసోహమనటం అనుకున్నారు. ఈ భావాలవల్ల వీరు జపాను ఒడిలోకి చేరారు. దీనికితోడు ప్రభుత్వంగూడా ప్రజాఉద్యమ ప్రాముఖ్యతను పూర్తిగా అర్థంచేసుకోలేదు. ద్రోహులనూ, పిరికి పందలనూ నిర్దాక్షిణ్యంగా తుడిచివేయలేదు. ప్రజాసంఘనిర్మాణాభివృద్ధిని ప్రోత్సహించలేదు. కొమింటాంగుయొక్క 1938 కార్యక్రమంఅమలుపరచలేదు. ఈకారణాలవల్ల ప్రభుత్వం బలహీనపడ్డది. పోసి జాతీయసంఘటనలో ముఖ్యపార్టీఅయిన కొమింటాంగైనా సభ్యత్వాన్ని వృద్ధిచేసికొని, కొత్తశక్తినిచ్చి, నిర్మాణాన్ని ప్రజాతంత్రమొనర్చలేదు. అలాచేయాలనికోరిన సన్‌యట్‌సేన్ సతిలాటి అభివృద్ధికాముకులగల సభ్యులున్నా కొమింటాంగ్ అలాగే ఉండిపోయింది."

(అర్థర్‌క్లైగ్ 'క్రొత్తచైనా పుట్టుక')

చైనా స్వాతంత్ర్యయుద్ధం మూడుదశలలో నడుస్తుంది. మొదటిదశ: శత్రువు పురోగమిస్తాడు. చైనీయులు శత్రువుతో తీవ్రంగా పోరాడుతూనే వెనక్కుతగ్గుతూ; చిక్కినవ్యవధిలో బలపడుతారు. రెండవదశ: స్వాతంత్ర్యశక్తులూ, శతృబలాలూ, సమఉజ్జీలౌతాయి. శతృవుకు ఆయుధసామగ్రి ఉన్నా, సప్లయికేంద్రానికి దూరమైపోవుటవల్ల, స్వాతంత్ర్య శక్తులు శతృవుబలంతో ఒకరకంగా సరితూకానికి వస్తాయి. మూడవదశ: స్వతంత్రశక్తులు చొరవదీసుకుని దండయాత్రచేసి జపానును దేశంనుండి తరిమివేస్తాయి.

యూరప్‌లో సోవియట్ రెడార్మీ ఫాసిస్టుశక్తులను హతమారుస్తోంది. సోవియట్‌భూమి అంతా నాజీముష్కరుల నుండి విముక్తిపొందుతోంది. మిత్రమండలి యూరప్‌పైన రెండోరంగం ప్రారంభించే శుభసమయం ఆసన్నమైంది. తలబిర్రలైతే వాలిపోయిన మొండెంలా జపాను చొరవ జచ్చింది. అయినా చైనా విజృంభించలేకుండా ఉంది. కారణం ఏమిటి? చైనా ఐక్యసంఘటనలో మూడు ధోరణులున్నాయి.

1. జపానుకు లొంగిపోవాలనేవారు.

2. విదేశాలపై ఆధారపడాలనేవారు.

3. ప్రజాతంత్రాన్ని అభివృద్ధిచేసి, ప్రతిఘటన సాగించాలనేవారు.

ఈ ముగ్గురిలోనూ చియాంగ్-కే-షేక్ రెండవ ధోరణికి చెందినవాడు. లొంగుబాటుదారులకు చైనాలో తావులేదు, కాబట్టి వారు రహస్యంగా జపానును ఆహ్వానిస్తారు. కమ్యూనిస్టు వ్యతిరేకభావాలను రెచ్చగొట్టి ఐక్యతను నాశనంచేయాలని చూస్తారు.

చియాంగ్-కే-షేక్, జపానుకు లొంగిపోవాలనడు. కాని కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా, పై లొంగుబాటుదారులను ఉపయోగించాలనేవాడు. వారికి అధికారం ఇవ్వకుండానే, వారిని ఉపయోగించుకొనాలనేవాడు. కాని, కమ్యూనిస్టు వ్యతిరేకత రానురాను చియాంగ్-కే-షేక్‌ను బలహీనపరుస్తోంది.

ప్రజాతంత్రాన్ని బలపరచి, ప్రజల ఆర్థికజీవనంబాగుచేసి, ప్రజల కాయుధాలనిచ్చి జపానును ప్రతిఘటించాలనే ధోరణి కమ్యూనిస్టులది. ఈ పంథాను చిత్తశుద్ధిగల లిబరల్స్‌సైతం బలపరుచుతున్నారు. యుద్ధకాలంలోనే, సన్‌యట్‌సేన్ ప్రజాసూత్రాలను అమలుపరచాలని, యుద్ధభారాన్ని తగినంత ధనవంతులపైన వేయాలనీ, కమ్యూనిస్టుల వాదన.

ఇందు కంగీకరించక, ప్రజాబలంపై ఆధారపడని జంగ్-కే-షేకు ఆంగ్లో-అమెరికన్ సామ్రాజ్యవాదుల సహాయం కోసం ఆర్తనాదం చేస్తున్నాడు. విదేశాల సహాయం అవసరమే. కాని వాటిని సద్వినియోగపరచాలి. ఇంతేగాదు.

రెచ్చగొట్టారు - రెచ్చిపోలేదు

1940 డిసెంబరులోగూడా చంకింగులో పోలీసు అధికారిలేనిది బహిరంగసభ పెట్టుకోడానికి అనుజ్ఞ లేదు. ఇంతవరకు కమ్యూనిస్టుపార్టీని చట్టరీత్యా గుర్తించలేదు. ఇంతవరకూ షెన్సీ-కను-నింగ్షా సరిహద్దు రాష్ట్రాన్ని గుర్తించలేదు.

1939-40 సంవత్సరంలో సోవియట్‌యూనియన్‌పైనా, కమ్యూనిస్టుపార్టీల పైనా నిందారోపణ, దూషణ, దుష్ప్రచారం ఎక్కువగాసాగినవి. వీటి వెనుక ఫాసిస్టులూ, యుద్ధప్రోత్సాహకులూ తమ దురాక్రమణ విధానం కొనసాగించ కొన దలచుకొన్నారు. చైనాలో (మిగతా 8 వ పేజీలో)

(7 వ పేజీ తరువాయి)

గూడా అంతే. చియాంగ్-కే-షేక్ వైఖరి గూడా దాన్నే ఆచరణలో ప్రోత్సహించింది. కమ్యూనిస్టులు నడిపే సైన్యాలకు డబ్బుగాని, ఆయుధాలుగాని యీయలేదు. పైగా శత్రువు వెనుక గెరిల్లా పోరాటాలు నడిపి, శత్రువులు ఆక్రమించిన ప్రాంతాలను తిరిగి ఆక్రమించుకుంటే దానిని కమ్యూనిస్టు దురాక్రమణయని పిలిచి, కమ్యూనిస్టులు పనిచేసే ప్రదేశం చుట్టూ దాదాపు 5,00,000 కొమింటాంగు సైన్యాన్ని కాపుదలపెట్టారు. కమ్యూనిస్టు ప్రదేశాలచుట్టూ మూడు దుర్గశ్రేణులు కట్టబడినవి. 1940 ఆఖరుకు అలాంటి దుర్గాలు 2000 ఉన్నాయని అన్నాలూయీస్ట్రాంగ్ రాస్తుంది. 1939 లో సరిహద్దురాష్ట్రి ముఖ్య పట్టణంపైన, యెనాన్ పైన, (కమూనిస్టులపైన) 34 వ కొమింటాంగుసైన్య అధ్యక్షుడు దండయాత్ర చేశాడు. 1940 అక్టోబరులో యాంగ్ట్సీ నదికి దక్షిణాన పనిచేస్తున్న కమ్యూనిస్టు సైన్యాలను నదిని దాటి ఉత్తరానికి పొమ్మని కొమింటాంగు సైన్యాధ్యక్షుడు ఆర్డరిచ్చాడు. ఆ ఆర్డరు అమలు జరిపితే 50,000 జపాన్ సైన్యాలు నిరాఘాటంగా చైనాలోకి విజృంభిస్తాయి. ఈ ప్రయాణంగూడా డబ్బు, మందుగుండు సామగ్రి లేకుండానే. ఇంతవరకు కమ్యూనిస్టు సైన్యాలు దేశమంతా విస్తరించియున్నవి గాబట్టి జపాను ఏమీ చేయలేకపోయింది. ఈ ఆర్డరు పాటిస్తే కమ్యూనిస్టు సైన్యాలన్నీ ఒకచోట కేంద్రీకరించబడతాయి. జపాన్ సైన్యాలనుండి అపాయం ఎక్కువౌతుంది. అయినా ఐక్యతకోసం, పై అధికారుల ఆర్డరును పాటించి 10000 కమ్యూనిస్టు సైన్యం (ఇందులో 6000 మందికి ఆయుధాలు లేవు) ప్రయాణమైపోతూండగా, దారిలో ఒక యిరుకైన కొండ కనుమ దగ్గర 80 వేల చైనా కొమింటాంగు సైన్యాలు చుట్టుముట్టి అగ్నివర్షం కురిపించాయి. ఇది 1941 జనవరి 6 వ తేదీని జరిగింది. 10 వేలలో రెండు వేలు చనిపోయినారు; 4 వేలు గాయపడ్డారు, లేక ఖైదీలైనారు. నాల్గవ సైన్యాధిపతి (కమ్యూనిస్టు) చంపబడ్డాడు. కొమింటాంగ్ ప్రభుత్వం యిలాంటి ఘాతుకాలను రెండు మూడు చేసింది.

చైనా కమ్యూనిస్టుపార్టీ మిలిటరీ కమిటీ యీ విషయాన్ని విచారిస్తే చంకింగ్‌లోని కొంతమంది అధికారులకూ జపానువాళ్ళకూ సంబంధాలున్నట్లు తేలింది. ఈ పరిస్థితులలో జపాను కొత్తప్రచారం సాగించడం మొదలుపెట్టింది — చంకింగ్‌తో సంధి రాయబారాలు సూచించడం, కమ్యూనిస్టులపై విద్రోహచర్యలను పురికొల్పడం. జపాను అనుకూలురు దేశమంతటా కమ్యూనిస్టులను నాశనం చేయాలని తీవ్రప్రచారం చేయసాగారు.

ఇకను కొమింటాంగు 11 వ విస్తృత సమావేశం 1943 సెప్టెంబరు రెండోవారంలో జరిగింది. కమ్యూనిస్టులు ప్రతిఘటనను నాశనంచేసి, జాతికపాయం తెస్తున్నారనీ, ఈ సమస్యను రాజకీయపద్ధతుల్లో పరిష్కరించాలనీ, తరువాత చట్టరీత్యా ప్రభుత్వం ఏర్పాటు చేయాలనీ తీర్మానించబడ్డది. చియాంగ్-కే-షేకు యిచ్చిన రిపోర్టుపైనే యింత తీర్మానం చేయబడ్డది. దీనిఅర్థం మళ్ళీ అంతర్యుద్ధం నడపడమనే. రాజకీయంగా ఈ సమస్యను ఎలా పరిష్కరించడం? దానిని వివరించుతూ, "చైనాభవితవ్యము"నే పుస్తకాన్ని చియాంగ్ కేషక్ వ్రాశాడు. అందులో, చైనాజాతిని గురించి, కొమింటాంగును గురించీ, చైనా స్వాతంత్ర్యోద్యమంలో కమ్యూనిస్టులు నిర్వహిస్తూన్న పాత్రను గురించీ, వట్టి తప్పులు వ్రాయబడ్డాయి. చైనా భవితవ్యం నియంతృత్వమేనని తేల్చబడ్డది. కాబట్టే యిలాంటి పుస్తకం చంకింగువర్గాలను దాటి బైటి ప్రపంచాన్ని చూడనోచుకోలేదు.

ప్రపంచ ప్రజల ఆందోళన

చైనాలో పరిస్థితు లిలాఉన్నాయి గనుకనే అమెరికా ఆందోళనపడి వాలెస్‌ను చైనాకు పంపింది. డెయిలీ మెయిలు పత్రిక, "సప్లయి స్థితిగతులు అరాజకంగా ఉన్నాయి. ....కమ్యూనిస్టు కొమింటాంగు ప్రభుత్వాల మధ్య చైనా రెండుగాచీలిపోయిందనవచ్చును. ....జపానుపైన పోట్లాడటానికి ఐక్యం గావటానికిమారుగా చైనీయులూ చైనీయులూ పోరాడుకుంటున్నారు .... ప్రజాతంత్రం అనే తెరమాటున ఎక్కువ నియంతృత్వరూపమైన ప్రభుత్వం పాలిస్తూంది" అని రాసింది.

"చైనా జాతీయసైన్యంలో అధికభాగం వెంటనే యుద్ధభయంలేని అనవసర ప్రదేశాలలో ఉంచవలసిన అవసరం ఉన్నదా?" అని పాల్‌రెంకర్ ప్రశ్నిస్తాడు.

ఐక్యసంఘటన జయించి తీరుతుంది

చైనా కమ్యూనిస్టులు జపాన్ వ్యతిరేక యుద్ధాన్ని చివరిదాకా బలపరుస్తారు. మరల అంతర్యుద్ధమంటే జపానుకు లొంగిపోవడమే కాబట్టే ద్రోహులు, జపాను అనుకూలురు, ఎంతరెచ్చగొట్టినా, చివరకు చియాంగ్ కేషేకు గూడా ఆదారితొక్కినా, కమ్యూనిస్టులు రెచ్చిపోలేదు. ఐక్యసంఘటనను కాపాడడంవల్లనే శత్రువును జయించవీలవుతుంది. కమ్యూనిస్టులపై నిర్బంధం సాగిస్తే విజయం రాదు, రాజకీయ ప్రజాతంత్రం స్థాపించితేనే విజయం వస్తుంది. చైనా ఐక్యసంఘటనను కమ్యూనిస్టులు రక్తమోడ్చి నిర్మించారు. రక్తమోడ్చి కాపాడుతారు. చైనా ఐక్యసంఘటన భగ్నమైపోదు. నిలుస్తుంది. జపానును జయిస్తుంది. తప్పదు.

మానిడంగ్ యిలాఅన్నాడు: "1927 లో కన్నా ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులు జాతీయఐక్యసంఘటనకు ఎక్కువ అనుకూలంగా ఉన్నాయి. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులు ఐక్యసంఘటనను భగ్నం కానీయవు సరికదా, దానిని బలపరచి ఫాసిజానికి సామ్రాజ్యవాదానికీ, వ్యతిరేకంగా ఏర్పడ్డ ప్రపంచ సంఘటనతో జతచేస్తాయి. ఈ విషయాలన్నీ చైనా ఐక్యతను కాపాడి జాతీయ స్వతంత్రాన్నీ, 'మూడు ప్రజా సూత్రాలనూ' జయప్రదంగా సాగిస్తాయి."

మాస్కో, టెహరాన్ సమావేశాలవల్లా, చైనా ప్రజల అచంచల ప్రతిఘటనవల్లా, చైనాకు సోవియట్ యూనియన్ నాయకత్వాన నిర్మింపబడుతూన్న ప్రపంచ సంఘటనలో శాశ్వతస్థానం దొరికింది. చైనాకు భయంలేదు.

మన కర్తవ్యం

మనమూ స్వతంత్రంకోసం పోరాడుతున్నాం. మనపైనా జపాన్ దండయాత్ర సాగుతూంది. సోదర చైనా సైనికులు మన సరిహద్దులలోకి వచ్చి జపానును ఎదిరిస్తున్నారు.

చైనాకూ మనకూ అనాదినుంచీ అవినాభావ సంబంధం ఉంది. దీనికి పరస్పర సహకారం ముఖ్య సూత్రం. చైనాకు మన మెప్పుడూ శుష్కప్రియాలతో సహకారం చెల్లించలేదు. ప్రత్యక్షకార్య సూరత్వంద్వారా తోడ్పడ్డాము. కాంగ్రెసు చైనాకు వైద్య దళం పంపి సత్సంప్రదాయాలు నెలకొల్పింది. ఆసంప్రదాయాలను ముందుకు తీసుకెళ్లాలి. ఎలా? మనదేశంలో ముఖ్యరాజకీయ పార్టీలను దగ్గరజేర్చి, ఐక్యసంఘటనను నిర్మించి జపానును ప్రతిఘటించాలి. అప్పుడు చైనా మోయవలసిన జాపాన్‌దాడి భారంలో మన పాలు మనం పంచుకుంటాం. చైనా ఎక్కువ గట్టిగాపోరాడగలదు. చైనా మనమూ చేయి చేయిగలిపి జపాను నోడించి స్వతంత్రం సంపాదించుకుంటాం. ప్రపంచ సంఘటనలో యిది మనవంతు.

(6వ పేజీతరువాయి)రించజాలదు. కంట్రోలు రేషనింగులు అమలు జరగవు. దొంగ మార్కెటును అరికట్టుట అసంభవం. రైతులు తమ మిగులు ధాన్యాన్ని బయటపెట్టరు. ప్రభుత్వం వెంటనే ధాన్యం, బియ్యం ధరలకున్న భేదాన్ని తగ్గించి, రైతుకు బస్తాకు రు. 11–0–0 చొ॥ ఇవ్వాలి. రైతుసంఘాల, ప్రజాప్రతినిధుల, సహకారంతో లెక్కలు తీయాలి. దొంగమార్కెటును బయటకు లాగుటకు ప్రజారక్షణదళం తదితర వాలంటీరుల సహాయం పొందాలి. రాష్ట్రమంతటకి ఒక సమగ్రమైన ఆహారవస్తువుల సరఫరా ప్లానుండాలి. ఏ జిల్లాకాజిల్లా సంకుచితపంథా నవలంబించి సరఫరాలను అరికడితే అనవసర చిక్కులు కల్గుతున్నాయి. ఈ ప్లాను విజయవంతం చేయడానికి ప్రభుత్వం కొంత కనీస ధాన్యపుస్టాకును నిర్మించాలి. ఆస్టాకును నిర్మించడానికి, తదితర కరువు ప్రాంతాలకు ధాన్యం పంపడానికి సేకరించే ధాన్యం రైతుల నుండి కమాండీరు చేసేటప్పుడు జరుగుతున్న అవకతవకలు పోవాలి.

దేశభక్తుల కర్తవ్యం

మనం చూస్తూఊరుకుంటే మన ఆంధ్ర మరో బెంగాలవుతుందంటే ఆశ్చర్యంలేదు. అన్ని రాజకీయపార్టీలు కలసి ప్రజల కాహారాన్ని సమకూర్చి దేశాన్ని రక్షించుటకు ముందుకు రావాలి. ప్రభుత్వప్లానులోని అవకతవకలను విమర్శిస్తూ దూరంగా కూర్చుంటే సాధించగలిగిన దేమీలేదు. రైతులు తమ మిగులు ధాన్యాన్ని కూలి, పేద, పట్టణ ప్రజలకు కంట్రోలు ధరలకు విక్రయించాలి.

జపాను మన దేశంలోకి చొచ్చుకొచ్చిన ఈ సమయంలో ఆహారాన్ని ప్రజలకు అందించి, దేశరక్షణను బలపర్చుటకు ప్రజా ఐక్యతతో ఈసమస్యా పరిష్కారానికి పూనుకుంటే ఏ విరంకుశ ప్రభుత్వము ఎదురు రాలేదు. మహాత్మా, సరోజినీ, మున్నగు దేశ నాయకులు ఆహారసమస్యా పరిష్కారానికి చూపుతున్న ఆతురత మనందరికి మార్గదర్శకం.

దొంగ వ్యాపారికి బుద్ధిచెప్పారు

★

నూజివీడులో వంకదారు సుబ్రహ్మణ్యం అనే లైసెన్సుదు ఇనుప వ్యాపారస్తుడు ఈనెల 9 వ తేదీని ఒక ఇనుప పలుగును కంట్రోలు రేటుకు మించి రు 10-13-0 కి ఒక రైతుకు అమ్మబోయాడు. రైతు సొమ్మిచ్చి, పలుగు తీసుకొని, రసీదు ఇవ్వమన్నాడు. సుబ్రహ్మణ్యం నిరాకరించడమే గాకుండా పలుగునుకూడా లాక్కోబోయాడు. రైతు దానిని వదలలేదు. చుట్టుప్రక్కల ప్రజలు పోగలు ఈదౌర్జన్యాన్ని ఖండించారు, లైసెన్సుదారు, తోడివర్తకుల్ని ప్రోగుచేసి, రైతుమీద దొంగతనం నేరం మోపుతానని బెదరించాడు.

ఇంతలో తాలూకా కమ్యూనిస్టు పార్టీ ఆర్గనైజరు అక్కడికి వచ్చాడు. చుట్టూ చేరియున్న ప్రజలకు లైసెన్సుదారు చేసే అన్యాయాన్ని తెలియజెప్పాడు. ఆదివరకుకూడా ఒకసారి యిలాగే చేసిన యీతని సంగతిని వివరించాడు. ప్రజలంతా వర్తకునియేవగించుకున్నారు. చివరకు పలుగు తీసుకొని, కాటా వేస్తుంటే, హెడ్‌కాన్‌స్టబుల్ వచ్చి, జరిగిన విషయం తెలుసుకొని, స్టేషన్‌కు రమ్మని పిలిచాడు. లైసెన్సుదారు, తాను కంట్రోలు రేటుకే అమ్మితినని చెప్పుకున్నాడు. 19 సేర్ల పలుగు రు. 2-8-3 కి బిల్లుయిచ్చి పంపించాడు. రు. 2-8-3 ఖరీదుచేసే పలుగును రు. 10-13-0 కు అమ్మజూచిన యీ వర్తకునికి ప్రజలు సరిగా బుద్ధిచెప్పారు.

★

సవరణ

గత సంచికలో 'బెంగాల్ నిధి వసూళ్లు' శీర్షిక కింద గొల్లప్రోలు పెళ్లిలో వసూలు రు 29" కి బదులు 'గొల్లపూడి పెళ్ళిలో....' అని చదవాలి.

• • •

10—5—44 సంచికలో, కామ్రేడ్ స్టాలిన్ ఉపన్యాసంలో, "సోవియటు యూనియన్‌లో మూడోవంతు భాగానికి పైగా విమోచనం కలిగింది." అని వుంది. "జర్మన్లు ఆక్రమించిన సోవియటు భూభాగంలో మూడోవంతు భాగానికిపైగా" అని వుండాలి.

★

విడుదల

మహీధర రామమోహనరావుగారు 1940లో అరస్టుచేయబడి డిటెన్షన్‌లో ఉంచబడ్డారు. ఈనెల 12వ తేదీని విడుదల చేయబడ్డారు.

• • •

కామ్రేడ్ భావనాచారి గొల్లప్రోలులో అరెస్టయి, మూడునెలలు శిక్షఅనుభవించి ఈ నెల 24న విడుదలయారు.

కళావేత్తలనందర్నీ బెంగాల్ కరువు కదిల్చింది

●

బొంగాలు వైజ్ఞానిక మండలి బొంబాయిలో విజ్ఞాన ప్రదర్శనాలు ప్రదర్శించడం ఇది మొదటిసారికాదు. ఈమధ్య అఖిలభారత మహిళాకాన్ఫరెన్సు సందర్భంలో వారు ప్రదర్శించిన బెంగాల్ క్షామప్రదర్శనంచూచి విజయలక్ష్మీపండిట్ కన్నీళ్లుగార్చింది. యు. పి. కి బెంగాల్ దళాన్ని ఆహ్వానించింది. సరోజినీదేవి ఈ మండలికి తన ఆశీర్వాదాలను ఇస్తూ, బెంగాల్ క్షామనివారణకు 100 రూపాయలిచ్చింది.

భూలాభాయిదేశాయి విజ్ఞప్తి

ఏప్రిల్ 21వ తేదీన మరొక ప్రదర్శనం జరిగింది. ఇది ప్రత్యేకంగా ఆహ్వానింపబడినవారికోసం జరిగిన ప్రదర్శనం. దీనికి శ్రీయుత భూలాభాయిదేశాయి అధ్యక్షత వహించారు. ఆరోజున టిక్కెట్లు పెట్టకపోయినా, దాదాపు 3 వేలు వసూలయింది. భూలాభాయిదేశాయి స్వయంగా 250 రూపాయలిచ్చారు. ఇంటర్వెల్ (విశ్రాంతిసమయం)లో మాట్లాడేటప్పుడు, భూలాభాయి ముఖంలో, బెంగాల్ క్షామప్రదర్శనాలను చూచిన ఫలితంగా ఏర్పడ్డ విషాదరేఖలు కన్పించుతున్నాయి.

"ఇక్కడ ప్రదర్శించినదానికంటె ఎక్కువ చెప్పడానికి నాకు శక్తిలేదు. బెంగాల్‌కు సహాయంచేయాలి. మీశక్తికొలది సహాయం చేయండి," అంటూ క్లుప్తంగాఉపన్యసించారు.

ఆ ప్రదర్శనకు వచ్చిన ఇద్దరు ఇంగ్లీషు సైనికులు, "ఇంతటి అద్భుతంగా ప్రదర్శించిన ప్రదర్శనను మరొకటి చూడలేదు," అంటూ తమ జేబులోని డబ్బంతా బెంగాల్ నిధికి ఇచ్చారు. సోవియటు ఫిలిం డిస్ట్రిబ్యూటర్ "సొయూడియంట్" అనే ఆయన ఇలా అన్నాడు: "ఇదే వాస్తవిక కళ."

తర్వాత కార్మికుల పేటలలో ఈ ప్రదర్శనాలు జరిగాయి. కార్మికులు ఈయుద్ధదినాల్లో ఎంతో అవస్థపడుతూగూడా, బెంగాల్ నిధికి చందాలిచ్చారు. ఒక కార్మికుడు తనకు 3-6-0 మిగుల్చుకొని మిగతా నెలజీతమంతా 73-6-0 బెంగాల్ నిధికి ఇచ్చివేశాడు.

మే 5 వ తేదీన బొంబాయి ప్రజలందరికోసం సముద్రతీరంలోని ఒక పెండాల్‌లో మరోప్రదర్శనం జరిగింది. దాదాపు 4 వేల పురుషులు ప్రదర్శనం - చూచారు. టిక్కెట్లు రు 0-8-0 నుండి 5-0-0 దాకా వుంది. పెండాలంతా నిండింది.

పృధ్వీరాజ్ విజ్ఞప్తి

మహాకవి ఇక్బాల్ వ్రాసిన "సారె జహాఁసే అచ్ఛా హిందూస్థాన్ హమారా" (ప్రపంచంలోకల్లా మన హిందూదేశం చాల మంచిది) అనే గీతంతో ప్రదర్శనం ప్రారంభమయింది. సుప్రసిద్ధ సినీమా నటుడు పృధ్వీరాజ్ ఈ పాటబాడిన దళానికి నాయకత్వం వహించాడు. పాట పాడేముందు ఇలా ఉపన్యసించాడు: "సాధారణంగా ఏదైనా పని ప్రారంభించేముందు భగవంతుని ప్రార్థన చేయడం మామూలు. మనం మన దేవతను - మాతృదేశాన్ని - స్తుతించుతూ కార్యక్రమం ప్రారంభించుదాం."

పృధ్వీరాజ్ ఇంకా మాట్లాడుచూ, ప్రస్తుత దేశ క్లిష్టపరిస్థితిని తొలగించడానికి హిందూ-ముస్లిం ఐక్యతకావాలన్నాడు. భిక్షుకవేషంతో, టోపీ పుచ్చుకొని, బెంగాల్ దళ నాయకుడు బినయరాయ్ మొదలగువారితో కలిసి ప్రేక్షకులవద్ద డబ్బు వసూలుచేశాడు. పృధ్వీరాజ్ టోపీలో డబ్బు ఘల్లున రాలింది.

ఈ ప్రదర్శనం చూడ్డానికి ప్రఖ్యాత నటీనటులూ, డైరెక్టర్లూకూడ వచ్చారు. శాంతారాం బెంగాల్‌నిధికి 100 రూపాయలిచ్చాడు. శాంతారాం భార్య, 'శకుంతల'లో శకుంతలగా నటించిన జయశ్రీకూడ మరొక 100 రూపాయలిచ్చింది.

బెంగాల్ వైజ్ఞానికమండలి పంజాబు వెళ్లినప్పుడు, కుట్టుపని చేసికొని జీవించే ఒక బీదస్త్రీ, తన వివాహ చిహ్నమైన రెండు గాజులను బెంగాల్ నిధికి ఇచ్చివేసింది. (మనకు మంగళసూత్రంలాగానే, వాళ్ళకు గాజులంత ప్రాముఖ్యం.) ఆగాజులను వెళ్లినచోటల్లా వేలంవేయడం, తిరిగి ఆ వేలం పాడినవారు వాటిని బెంగాల్ దళానికే ఇచ్చివేయడం జరుగుతూ వచ్చింది. వేలకువేలు బెంగాల్‌నిధికి అలా ప్రోగయ్యేవి. వీటితో బాటు ఆ బీదస్త్రీ దేశభక్తి చరిత్రకూడా దేశమంతా వ్యాపించింది.

ఇంటర్వెల్‌లో పృధ్వీరాజు ఈ గాజులను వేలంవేశాడు. మరొక ప్రఖ్యాతనటకుడు మోతీలాల్ వాటిని 1500 రూపాయలకు కొన్నాడు.

ఈ ప్రదర్శనాలకు అధ్యక్షత వహించిన డాక్టర్ ఆర్. యన్. కపూర్ బొంబాయిలో సుప్రసిద్ధ సర్జన్. ఆయన బెంగాల్‌లో రోగుల సేవచేయడానికి వెళ్తున్న డాక్టర్ల దళాన్ని వేదికపైకి తీసుకువచ్చి పరిచయంచేశారు. ఆనాటి సమావేశానికి సుప్రసిద్ధ హిందీమహాకవి సుమిత్రానందన్‌పంత్ కూడా వచ్చాడు. చిన్నచిన్నలోపాలు ఉన్నా చాలా బాగున్నవని ఈ ప్రదర్శనాలను మెచ్చుకొన్నాడు.

మే 6 వ తేదీన మళ్లా ఇవే ప్రదర్శనాలు జరిగాయి. గతదినం వీటిని చూచిన పత్రికలు వీటిని హర్షించుతూ ప్రచారం గావించాయి, గాంధివాద పత్రికయగు, "జన్మభూమి" (దినపత్రిక) ఇలావ్రాసింది: "ప్రదర్శనల ఉద్దేశ్యం చాలాఉన్నతమయింది. కార్యక్రమం చాలా బాగావుంది. ప్రదర్శనలు వాస్తవిక కళలను ప్రదర్శించుతున్నాయి."

ఈసారి పృధ్వీరాజ్ పాడినప్పుడు, అతని పిల్లలిద్దరూ, బినయ్‌రాయి మొదలగువారూ ఆపాటనందుకొని పాడారు.

ఆరోజు ప్రదర్శనసభకు శ్రీమతి సోఫియా వాడియా అధ్యక్షతవహించింది. అనాడే గాంధీజీ విడుదలఅయ్యాడు. కొంతకరువు తగ్గినట్లుగా సంతోషించారందరూ. గాంధీజీకి స్వాగతమిస్తూ ఆమె ఉపన్యాసం ప్రారంభించింది. బెంగాల్‌కు సాయంచేయాలని ఉత్తేజకరంగా ఉపన్యసించింది.

హరీంద్ర కవీంద్రుని గీతాలు

సుప్రసిద్ధకవీ, నటకుడూ, గాయకుడూ అయిన హరీంద్రనాథ చటోపాధ్యాయ "ఆగే బఢో, ఆగేబఢో" (స్వతంత్రదినం సమీపించింది, ముందుకునడు, ముందుకునడు) అనే గీతం పాడాడు. భిక్షుకవేషంతో ఉపన్యసించాడు. అంతటిక్రితంరోజునే ఒక గీతంలో మహాత్ముని విడుదలచేయాలంటూ హరీంద్రుడు పాడాడు. ఈనాడు విడుదల సంభవించింది. "ఈనాడు ప్రజలు విజయం పొందారు. ప్రజాతంత్రవాదానికి ప్రతిబంధకం తొలగిపోయింది. దేశవిముక్తి ఆరంభమయింది," అంటూ హరీంద్రు డుపన్యసించాడు. ఇంకా ఇలా అన్నాడు:

"ఈరోజు ఇంకో విధంగాకూడా చిరస్మరణీయమైనదే. దేశచరిత్రలో ఒకనూతన కళ ఆవిర్భవించుతోంది. ఇది ప్రజలకళ. ప్రేమకథలు విని విని విసుగుపుడుతున్నది. నిర్జీవమైన, వాస్తవికంగాని, అభినయాన్ని చూచికూడా విసుగుపుడుతోంది. అలా కాక ఇది ఒక నూతన కళకు ప్రారంభం."

ఇది అయిన తర్వాత, గత సంవత్సరం చిత్తప్రసాద్, అఖిలభారత కమ్యూనిస్టుపార్టీ మహాసభ సందర్భంలో వ్రాసిన మహాత్ముని పటాన్ని వేలంవేశారు. శ్రీమతి ఫాతిమా ఇస్మాయిల్ 3550 రూపాయలకు కొంది. మొత్తం ప్రదర్శనానికి ఏడెనిమిది వేల రూపాయలు వచ్చాయి. మహాత్ముని విడుదల వార్తవిని చిత్తప్రసాద్ పూనా వెళ్ళి, మహాత్ముని చిత్రాన్ని మూడు రంగులలో చిత్రించాడు. అది 7 వ తేదీన ఈ ప్రదర్శనాలలో రు. 2500 లకు కొన్నారు. తిరిగి వేలంవేసికొనేందుకు ఇచ్చివేశారు.

బాలగంధర్వ ప్రశంస

7 వ తేదీ ప్రదర్శనాలకు, మహారాష్ట్ర నాట్యకళా ప్రపూర్ణుడయిన బాలగంధర్వ అధ్యక్షత వహించాడు. ఆయన ఇలా అన్నాడు: "నేను 40 ఏండ్లనుండి నటించుచున్నాను. కాని ఈ అభినయంచూచి శ్రద్ధాంజలి నర్పించుచున్నాను."

బెంగాల్ వైజ్ఞానికదళం, బెంగాల్ క్షామ దృశ్యాలను నాటకాలద్వారా, నృత్యంద్వారా ప్రదర్శించి, అఖిలభారత ప్రశస్తినిపొందింది. పంజాబులో లక్ష 25 వేలు రూపాయలు ప్రోగుచేసింది.

ఒక్క రూపాయలతోనే సమస్య తీరిపోదు. బెంగాల్ ప్రజల యెడల సానుభూతి, వారిని రక్షించాలనే బాధ్యతను గుర్తించడం ప్రజలలో రావాలి. ఆచైతన్యం కలిగించడానికే ఈ దళం పనిచేస్తూంది. ఈ ప్రదర్శన లింత ప్రతిభావంతంగా ఉండటానికి కారణం ఏమిటి? "జన్మభూమి" పత్రిక చెప్పినట్లు,"నటకులు ప్రజలకోసం పనిచేస్తూ, ప్రజల కష్టసుఖాలెరిగిన ప్రజల ముద్దుబిడ్డలు గాబట్టే."

(4 వ పేజీ తరువాయి)

ఉల్లిగడ్డల యెగుమతిపై నిషేధం

కడపజిల్లా కలెక్టరు ఉల్లిగడ్డల యెగుమతిని నిషేధిస్తూ చేసిన ప్రకటన ఫలితంగా వ్యాపారస్తులు భయపడి సరుకును ఖరీదు చెయ్యనందున రైతుల్లో ఆందోళన బయలుదేరింది.

శ్రీ పంజం పట్టాభిరామిరెడ్డి (కాంగ్రెస్) కామ్రేడ్ పంజం నరసింహారెడ్డిగార్లు నూరుమంది రైతులతో కలెక్టరువద్దకు రాయబారం వెళ్ళి ఉల్లిగడ్డలను న్యాయమైన ధరకు రైతులనుండి ఖరీదు చేయించేలాగున చూడవలెనని కలెక్టరును కోరగా, 20 రోజుల లోపల తగిన సౌకర్యాలు కలుగజేస్తానని సమాధానమిచ్చాడు.

బళ్ళారిజిల్లాలో పశువుల కరువు

"కరువుచే బాధపడుచున్న బళ్లారి ప్రజలు తమ పశువులకు మేతలేక బెంగుళూరు మొదలైన ప్రాంతాల్లో అమ్ముకున్నారు. రైతులు ప్రాణప్రదమైన పశుసంపదలేక చాలా అవస్థపడుతున్నారు. మైసూరు సంస్థానం నుంచి యిచ్చుటకు యెద్దులు రావలసినపరిస్థితుల్లో యిక్కడనుంచి అక్కడకు పశువులు పోవుటవల్ల, యెద్దులు చేసేపని మానవుడు చేయవలసివస్తున్నది: ఈ విధంగా అధికాహారోత్పత్తి కుంటుపడుతూ, దేశరక్షణ బలహీనపడుచున్నది. కనుక మద్రాసు ప్రభుత్వం మైసూరు ప్రభుత్వంతో రాయబారాలు జరిపి, పశువులకు కరువైన ప్రాంతాలకు అచ్చటినుంచి సప్లయిచేయించ వలసినదిగా ప్రభుత్వాన్ని కోరవలెను." అని గుత్తితాలూకా రైతుసంఘ ఆర్గనైజరు, నారాయణరావుగారు వ్రాయుచున్నారు.

తిరువూరు తాలూకా తృతీయ రైతు మహాసభ

తిరువూరు తాలూకా తృతీయ రైతుమహాసభ ప్రతినిధుల సమావేశం మే 11, 12 తేదీలలో కంభంపాడులో జరిగింది. 16 గ్రామాలనుంచి 48 గురు ప్రతినిధులు హాజరైనారు. సయ్యద్ సాలార్‌గారి అధ్యక్షత క్రింద సమావేశం జరిగింది. కామ్రేడ్ పి. సుందరం ప్రారంభోపన్యాసమిచ్చారు. అనంతరం కార్యదర్శి రిపోర్టు ప్రవేశపెట్టాడు.

అధికోత్పత్తి, చెరువుల మరమ్మతు, వ్యవసాయ పనిముట్ల సేకరణ, తాలూకాలో కొత్తరోడ్ల నిర్మాణం, స్కూలు టీచర్ల అలవెన్సు మొదలైన సమస్యలను గురించి 14 తీర్మానాలు ఆమోదించబడ్డాయి. 1944 సంవత్సరానికి నూతన కార్యనిర్వాహకవర్గం ఎన్నుకోబడ్డది.

* * *

తిరువూరు తాలూకా (క్రిష్ణాజిల్లా)లో, రోలుపడి చెర్వుక్రింద 900 యకరాలు సాగవుతుంది. మరొక 300 యకరాలు అదనంగా సాగగుటకు అవకాశముంది. చెరువు మరమ్మతులేక నీటివసతి చాలా తక్కువగానున్నది. ఈచెరువులో 2 సంవత్సరాలనుండి వర్జీనియా పుగాకు నాటబడుచున్నందున ఆహారపంటలు నష్టపడ్డవి. చెరువుమరమ్మతు గావించాలని చేసిన తీవ్రాందోళన ఫలితంగా ప్రస్తుతం తాత్కాలికంగా మరమ్మతు చేస్తున్నారు. తిరిగి వర్జీనియాపుగాకు వేయకుండా ఆహారపదార్థాలే పండించాలని తాలూకా ప్రజలు తీవ్రాందోళన చేయాలి.

గ్రీసులో ఐక్యతాఉద్యమ విజయం

గ్రీసులో గెరిల్లా ముఠాలు మూడున్నాయి. ఒకటి కర్నల్ సారోస్ నాయకత్వాన పనిచేస్తోంది. దీనిని "ఎక్కా" (ఇ.కె.కె.ఎ.) అంటారు. ఇందులో 1000 మంది ఉంటారు. ఉన్నపరిమితిలో కొంత పనిచేయగల్గినా, ఇదంత చెప్పుకోదగిన శక్తిగాలేదు.

రెండవది, కర్నల్ జెర్వాస్ నాయకత్వాన పనిచేస్తోంది. పూర్వం మూడువేలమంది ఈ ముఠాలో వుండేవారు. ఇపుడు 1500 మంది ఉన్నారు. దానిని "ఈడెస్" (ఇ.డి.ఇ.ఎస్.) అంటారు. మూడవది "స్వతంత్ర జాతీయైక్యసంఘటన" యొక్క సైన్యం. ఈ సైన్యాన్ని 'ఎలాస్' (ఇ.యల్.ఏ.ఎస్.) అని పిలుస్తారు. స్వతంత్ర జాతీయైక్యసంఘటనను "ఇ.ఎ.యం." అని పిలుస్తారు.

స్వతంత్ర జాతీయైక్య సంఘటన

ఈ మూడుముఠాలోనే అన్ని పక్షాలు ఐక్యతతో పనిచేస్తున్నాయి. ఇందులో 40వేల మంది సాయుధులై నిరంతరం గెరిల్లాయుద్ధాలలో మునిగివున్నవారున్నారు. ఇంకాఆయుధసామగ్రిరాగానే యుద్ధంలోకి ఉరకడానికి సిద్ధపడిన రిజర్వుసైన్యం లక్షవుంది.

స్వతంత్ర జాతీయ సంఘటనలో, రైతుపార్టీ, సోషలిస్టుపార్టీ, కమ్యూనిస్టుపార్టీ, అఖిల కార్మికసంఘ సమ్మేళనం, రైల్వేకార్మిక సంఘం మొదలైనవెన్నో ఉన్నాయి. అల్బేనియా సరిహద్దులనుండి కొరింత్ అఖాతంవరకు దేశంలో శతృవులను లేకుండా తుడిచివేసింది.

రెండవ ముఠానుగురించి క్లుప్తంగా ఇక్కడ చెప్పాలి. ఆ ముఠా నాయకుడైన కర్నల్ జెర్వాస్‌ను బ్రిటిషుప్రభుత్వంబలపోర్దుచేస్తోంది. బ్రిటిషు ఆయుధాలు లేకపోతే అతడొక చెప్పదగ్గ శక్తి కానేకాదు. జెర్వాస్ స్వతంత్ర జాతీయైక్య సంఘటనతో అప్పుడప్పుడు దెబ్బలాటలకు దిగుతున్నా, మధ్యప్రాచ్య సర్వసైన్యాధికారి ఇతనికే సహాయంచేస్తూ వచ్చాడు. బ్రిటిషు ప్రధాని చర్చిల్ సైతం ఇతనిని మొన్నటి ఉపన్యాసంలో పొగిడాడు. బ్రిటిషు ప్రభుత్వం ఇలా ఎందుకుచేస్తోంది?

స్వతంత్ర జాతీయైక్య సంఘటన, ప్రజలలో చొచ్చుకుపోయిందనీ, అతివాదదృక్పథం కలదనీ, కమ్యూనిస్టుల పలుకుబడి క్రిందవుందనీ, బ్రిటిషు సామ్రాజ్యవాదుల భయం. కాని స్వతంత్రజాతీయైక్యసంఘటన, ఏఒక్క కమ్యూనిస్టులదీకాదు. గ్రీసుదేశ విముక్తిని కోరే పక్షాలన్నీ అందులోవున్నాయి. సైన్యాధికారులు, ఉద్యోగస్థులు, రైతులు, పొగాకు పనివారలు, రైల్వేకార్మికులు, పట్టణవాసులు, పల్లెవాసులు, చివరకు మతాధిపతులుకూడా అందులో ఉన్నారు. దాబాపాయా అనే మతాధిపతి స్వయంగా తుపాకిపట్టి యుద్ధంచేస్తున్నాడు.

స్వతంత్ర జాతీయైక్యసంఘటన నాల్గు పత్రికలు ప్రకటించుతోంది. ఇవిగాక కమ్యూనిస్టులు మరిమూడు పత్రికలు ప్రకటించుతున్నారు. ఈ విధంగా ప్రజలతో నిత్య సంబంధం ఈ ఐక్యసంఘటనకు ఉంది.

సమ్మెలను, ప్రదర్శనాలను నడుపుచున్న ఈ ఉద్యమం, 1943 మార్చిలో అద్భుత సాహసాలను ప్రదర్శించింది. జర్మను యుద్ధకార్యాలకు గ్రీకుకార్మికులను నిర్బంధంగా సమీకరిస్తూ, జర్మన్ ప్రభుత్వం ఒక ఉత్తరువు చేసింది. వెంటనే సర్వజనీనసమ్మె జరిగింది. అన్నిశాఖలలో, చివరకు ప్రభుత్వ ఆఫీసులలో సైతం సమ్మెలుజరిగాయి. ఏథెన్సులోను, పిరియస్‌రేవులోను రెండున్నరలక్షల సైన్యం ప్రదర్శనాలు గావించుకుంటూపోయి జర్మను కార్మికమంత్రి కార్యాలయాన్ని దగ్ధంచేసింది. దీని ఫలితంగా పైఉత్తరువురద్దుచేయబడింది. ఈ ఒక్కఘటనచాలు దీని బలాన్ని తెలియచేయడానికి.

ఇక సైనికవిషయంలో గూడ మామూలు సైన్యానికుండవలసిన పకడ్ బందులన్నీ వున్నాయి. సైన్యాలను వివిధ డివిజన్లగా విడదీయడం, వాటికి ప్రధాన కార్యాలయాలు ఏర్పరచడం, సప్లయిడిపార్టుమెంటులు ఏర్పరచడం, సైనికులకు తర్ఫీదునిచ్చే ఆఫీసర్సు స్కూళ్ళను నడపడం మొదలైనదంతా వుంది. కాని, ఆయుధసామగ్రి కొరతగావుంది. యూనిఫారాలుకుట్టే సాధన సంపత్తి లేకపోవడంవల్ల వివిధదేశాల యూనిఫారాలను ధరించవలసివస్తోంది.

శతృవులచెరనుండి తప్పించబడిన భాగాలలో, జపానుశ్రేణుల వెనుక చైనాలోవలెనే జీవితం, పరిపాలన, సాగింపబడుతోంది. విముక్తి చెందిన ప్రదేశంలోని ఒక గ్రామాన్నిగురించి వ్రాస్తూ, గెరిల్లాల ప్రవర్తనను గురించి, ఒక పత్రిక ఇలావ్రాసింది. "గెరిల్లాల ప్రవర్తన చాలాబాగావుంది, గ్రామస్థుల నడగనిదే, ఒక్కవస్తువు కూడా ముట్టుకొనేవాళ్ళుగాదు."

కొజానేబిషప్ ఇలా అన్నాడు: "గ్రీకు చరిత్రలో ఇదివరకెన్నడూలేని క్రమశిక్షణ, భద్రత, దేశభక్తి, మతగౌరవము, ఐక్యత ఇపుడు ప్రదర్శించబడుతున్నాయి."

గెరిల్లా సైనికులను చేర్చడానికి, దొంగలను, ద్రోహులను శిక్షించడానికి వివిధ కమిటీలు ఏర్పడి పనిచేస్తున్నాయి. ఈ కమిటీల ప్రతినిధులు జిల్లాకాంగ్రెసులను జరుపుతూ వుంటారు. థెస్సాలీలో జరిగిన ఇలాంటి కాంగ్రెసు, తమ గౌరవ అధ్యక్షులుగా టిమొషెంకో ఐసన్‌హోవర్, మాంట్‌గామరీ" లను ఎన్నుకొని మిత్రరాజ్య ప్రజల ఐక్యతను చాటారు.

ఇలా, దేశీయులందరి ప్రేమనూ చూరగొని, జర్మన్ల ప్రక్కలో బల్లెమైన, స్వాతంత్రజాతీయైక్య సంఘటన యెడల బ్రిటిషు ప్రభుత్వం చూపే సవతిప్రేమకు విరుద్ధంగా అందోళన బయలుదేరింది. గ్రీకు గెరిల్లాలకు సహాయం చేయాలని ఆందోళన హెచ్చింది. తత్ఫలితంగా ఫిబ్రవరిలో చర్చిల్ తన ఉపన్యాసంలో "ఎక్కువగా శతృవులను ప్రతిఘటించేవారికి సహాయంచేస్తానంటూ" వాగ్దానం చేశాడు.

ఐక్యతకై కృషి

గ్రీసులోని స్వతంత్రజాతీయైక్య సంఘటన, బ్రిటిషు సామ్రాజ్యవాదుల ఎత్తును గ్రహించింది. ప్రజాశక్తులకు భయపడే బ్రిటిషు ప్రభుత్వం అనైక్యత పేరిట తమకు సాయం చేయ నిరాకరించుతుందని గ్రహించింది. అందుచే ఐక్యతకు కృషి చేసింది. తక్కిన రెండు గెరిల్లా ముఠాలతో గూడ ఐక్యత ఏర్పర్చుకొంది. దాని ఫలితంగా మార్చి 10 వ తేదీన "పొలిటికల్ కమిటీ ఆఫ్ నేషనల్ లిబరేషన్" (దేశవిముక్తికై కృషిచేసే రాజకీయ కమిటీ) ఏర్పడింది. దేశవిముక్తి, విముక్తినొందిన దేశాల పరిపాలనా విషయం, ఈకమిటీ ఆలోచించి పని చేస్తుంది. ఈ కమిటీ మార్చి 12 వ తేదీన బ్రిటన్, అమెరికా, రష్యాలకు ఒక లేఖను పంపింది. ఆ ఉత్తర సారాంశం ఇది:

"అనైక్యతవల్ల మా దేశానికీ, మిత్ర రాజ్యాలకూ నష్టం, శతృవుకు లాభం. ఐక్యతవల్ల, విజయాలింకా వృద్ధిఅవుతాయి. ఇప్పుడు లభించిన ఐక్యత ఫలితంగా జాతీయైక్య ప్రభుత్వాన్ని సాధించే మార్గాన దేశం నడవగల్గుతోంది." ఇంతేగాక మిత్రరాజ్యాలఆశయమైన ఫాసిస్టు వినాశనమూ; అట్లాంటిక్ చార్టర్‌లోను, మిత్రరాజ్య ప్రభుత్వాల ప్రకటనల్లోను, చెప్పబడిన "ప్రజాస్వాతంత్ర్యమూ"; సాధించటానికి కృషిచేస్తామని తెలియజేశారు. ఆయుధసహాయం చేయండని కోరారు. ఈ ఉత్తరంమీద, కర్నల్ బాక్రిడ్జిస్ (స్వతంత్ర జాతీయ సైన్య కమిటీ ఆర్గనైజరుగాను, సెక్రటరీగాను ఇదివరకు ఉండేవాడు), కమ్యూనిస్టు ప్రముఖుడు జి. శాంటోస్, ఇతర పక్షంవారు సంతకాలు చేశారు.

మంత్రివర్గాలలో మార్పులు

ఈ ఐకమత్యం ఫలితంగా గ్రీకుప్రభుత్వంలో మార్పులు వస్తూవచ్చాయి. ఏప్రిల్ 6 వ తేదీన వెనిజెలోస్ మంత్రివర్గం ఏర్పరిచాడు. అది 26 వ తేదీన రాజీనామా నిచ్చింది. అతనిస్థానే, సోషల్ డెమాక్రాట్‌జార్జ్‌పపాండ్రియో ప్రధానమంత్రి అయాడు.

"కొత్త గ్రీకు ప్రధానిని, ప్రవాసంలోఉన్న గ్రీకు ప్రభుత్వ ప్రతినిధులను, కలిసి చర్చించడానికి, గ్రీకుగెరిల్లానాయకులు మధ్యప్రాచ్య దేశానికి వచ్చారు." అంటూ ఒకవార్త మే 9 వ తేదీన వచ్చింది. గెరిల్లానాయకులు, ప్రవాసంలో వున్న ప్రభుత్వ ప్రతినిధులు కలసి చర్చించడానికి ఇదేమొదటిసారి.

ఈ సమావేశం లెబనాన్ పర్వతాలలో జరిగింది. గ్రీకు ప్రజల ఐక్యత సాధించడానికి 8 పాయింట్లతోగూడిన ఒక కార్యక్రమం ఈసమావేశంలో ఆమోదించబడింది. అందులో ముఖ్యమైనవి: మధ్యప్రాచ్యంలోని గ్రీకు సైనికులను తిరిగి సంఘటితపరచడం; స్వతంత్ర గ్రీసులోని గెరిల్లాముఠాలను ఐక్యపరచడం; ఇతరుల ఒత్తిడి లేకుండా, తమంత తాము తమ యిష్టంవచ్చిన రాజ్యాంగాన్ని, ప్రభుత్వాన్ని ఎన్నుకొనే స్వేచ్ఛ, గ్రీసుదేశం విముక్తిచెందిన వెంటనే, ప్రజలకు ఈయడం; దేశద్రోహులను శిక్షించడం, వగైరా.

ఈ ఐక్యత ఫలితంగానే పపాండ్రియో తనమొదటి మంత్రివర్గాన్ని రద్దుచేశాడు. నూతన మంత్రివర్గాన్ని 27 వ తేదీన ఏర్పరిచాడు. ఈ మంత్రివర్గంలో విశాలైక్యత ప్రతిబింబించుతోందని చెప్పనక్కరలేదు. గ్రీసు భవిష్యత్తు గ్రీకుప్రజలే నిర్ణయించుగలరని ప్రవాసప్రభుత్వానికి తెలిసేటట్లు చేసింది. నాజీలను నిరంతరం ప్రతిఘటించుతూన్న గెరిల్లాల ఉద్యమమే. దక్షిణంనుండి దెబ్బతీసే మిత్రరాజ్యాలకు గ్రీసులో ఈ ఐక్యత ఫలితంగా మార్గం సులభమవుతుంది. బాల్కన్‌రాజ్యాల విముక్తికి సహాపడుతుంది.

ఈ మధ్య గ్రీకుసైనికదళం, కొందరు గ్రీకునావికులు, అభివృద్ధినిరోధకులు రెచ్చగొట్టిన ఫలితంగా రెచ్చిపోయి తిరుగుబాటుచేశారు. బ్రిటిషు సైన్యంసహాయంతో తిరుగుబాటును గ్రీక్ ప్రభుత్వం అణచివేసింది. అప్పటికింకా ఈఐక్యమంత్రివర్గం ఏర్పడలేదు. ఈతిరుగుబాటును ఆధారంచేసికొని, స్వతంత్ర జాతీయైక్యసంఘటనను, దాని సైనిక భాగమైన 'ఎలాస్'ను నిందించడానికి చర్చిల్ పూనుకొన్నాడు. తాము ఇదివరకు సహాయంచేస్తూ వచ్చిన కర్నల్ జర్వాస్‌ను పొగిడాడు. స్వతంత్ర జాతీయైక్య సంఘటనలోని గెరిల్లాల దురాగతంవల్లే కొందరు నాజీల పక్షన చేరుతున్నారని అన్నాడు. ఆవిధంగా, తాము ఇదివరకు చేస్తున్న చర్యలను సమర్థించుకోడానికి చూశాడు. అంటే కర్నల్ జెర్వాస్‌కు మాత్రం సహాయంచేసి, ముఖ్య గెరిల్లా ముఠాకు సహాయం చేయకపోవడాన్ని సమర్థించుకోవాలని చూచాడు. బాధ్యత తెలియకుండా ప్రవర్తించిన వారి చర్యలను, కమ్యునిస్టులు, స్వతంత్ర జాతీయైక్య సంఘటన, దేశవిముక్తికి పనిచేసే గ్రీకురాజకీయకమిటీ, ఏకగ్రీవంగా ఖండించాయి. కాబట్టి ఇకముందు ఇలాంటి సంఘటనలుండవు. ఈ నాడేర్పడిన విశాల జాతీయైక్యత ఫలితంగా, చర్చిల్‌లాంటివాళ్ళు వేలుబెట్టి చూపడానికి అవకాశం వుండదు. గ్రీకుప్రజలకు విరుద్ధంగా వారినెత్తిన రాజరికాన్నో, మరొకఅభివృద్ధినిరోధకప్రభుత్వాన్నో రుద్దాలనే ప్రయత్నాలు గూడా ఫలించవు.

కృష్ణ కాలువలు జూన్ 1 వ తేదీన తెరువబడతాయి

కృష్ణా ఈస్టరన్ డెల్టా ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగారు ఇలా తెలియజేశారు:

కృష్ణా ఈస్టరన్‌డెల్టా మెయిన్ కాలువలు జూన్ 1 వ తేదీన తెరువబడతాయి. కాని ఇప్పుడు కృష్ణా నదిలో నీరు ఎక్కువ లేనందున కాలువలో 1 అడుగు లేక 1½ అడుగుల కంటె ఎక్కువ నీరు సప్లయి కాదు. అందుచే మెయిన్ స్లూయిస్‌లకు తప్పితే మెరక కాలువలకు నీరు సప్లయి కాదు. కృష్ణానది వచ్చేవరకు పరిస్థితి ఇలాగే వుంటుంది.

ఇంకొక పదిరోజులలో ఏరు రావచ్చునని పి. డబ్లియు శాఖవారు ఆశిస్తున్నారు.

ఆంధ్రలో సోవియట్ మిత్రమండలి ఉద్యమం

"సోవియట్ రష్యాను గురించి భేదాభిప్రాయాలు ఎవరికి ఉంటయి: స్వాతంత్ర్యం కోరే ఏదేశపు ప్రజలైనాసరే సోవియట్ విధానాన్ని గురించి తెలుసుకొనుట అవసరమే"

గుంటూరు నుంచి విజయనగరం వరకూ పెద్దపట్టణా లన్నిటిలో సుమారు 200 మంది విద్యాధికులను కలుసుకున్నప్పుడు దాదాపు అందరూ వెలిబుచ్చిన అభిప్రాయమిది: వారివారి పట్టణాల్లో సోవియట్ మిత్రమండలిని స్థాపించుటకు అందరూ సహకారం చేస్తామన్నారు.

నిజానికి దేశభక్తిపూరితులైన లాయర్లు, డాక్టర్లు, లెక్చెరర్లు, టీచర్లు, నటకులు, చిత్రకళోపాసకులు, పత్రికా విలేఖరులు, మొదలైన విద్యాధికులందరూ చూపిన ఉత్సాహమే దేశమంతటా సోవియటు మిత్రమండలి ఉద్యమానికి గట్టిపునాదులు వేసింది. ఆంధ్రలో గూడా వీరే ఈ ఉద్యమాన్ని నిర్మిస్తున్నారు.

దేశవ్యాపిత ఉద్యమం

సోవియటు మిత్ర మండలి ఉద్యమం దేశవ్యాపిత ఉద్యమంగా అభివృద్ధిఅవుతోంది. బెంగాల్, బొంబాయి, పంజాబ్ మొదలైన రాష్ట్రాలలో 3 సంవత్సరాలక్రితమే ప్రారంభమయి క్రమేణా మిగిలిన రాష్ట్రాలకు వ్యాపిస్తోంది.

ఈ ఉద్యమ ఫలితంగా, అభివృద్ధిని, స్వాతంత్ర్యాన్ని కోరే ప్రముఖ విద్యాధికులందరూ ఏదేశపుప్రజలైనాసరే వారి భవిష్యత్తును వారే నిర్ణయించుకోవాలని కోరే సోవియట్ ప్రజలపక్షాన ఉండి వారితో స్నేహసంబంధాలను పెంపొందించుటకై ముందుకు వచ్చారు. ఫాసిస్టుల వినాశనము ద్వారా స్వాతంత్ర్యమును నిలబెట్టుకోవాలని కోరే ప్రముఖ విద్యాధికులందరూ, ఫాసిస్టులను నాశనం గావించి స్వాతంత్ర్యాన్ని రక్షిస్తున్న సోవియట్ పక్షాన నిలబడి ఫాసిస్టులను ఎదిరించుట దేశభక్తిపూరిత సాంప్రదాయమని గ్రహించిన వారందరూ, సోవియట్ మిత్రమండలిలో చేరారు. అనేక విధములుగా ఒక నూతన చరిత్రను నిర్మిస్తున్న సోవియట్ రష్యాను గురించి సమగ్రంగా తెలుసుకొనుటకై కృషిచేస్తూ, మంచి గుణపాఠము లన్నిటిని మన ప్రజలలో ప్రచారం చేస్తున్నారు.

ఆంధ్ర, తమిళనాడులోగూడా ఈ ఉద్యమం బయలుదేరి, త్వరగా అభివృద్ధి అవుతోంది.

జాతీయ నాయకులైన శ్రీమతి సరోజిని నాయుడు మొదలైన వారి అభివందనములను పొంది, సో. మి. మండలి ఉద్యమం నేడు ఒక దేశవ్యాపిత ఉద్యమంగా వ్యాపించి, అభివృద్ధి, స్వాతంత్ర్యాలను కోరే విద్యాధికులనందరిని ఒక వైపుకుచేర్చి, జాతీయ ఉద్యమానికి దోహదమిచ్చే సహాయకారిగా వృద్ధి అవుతూంది.

ఆంధ్రలో

వివిధవృత్తులకుచెందిన మధ్యవర్గపు విద్యాధికులందరూ మేల్కొంటున్నారు. సోవియట్ అంటే అభిమానం గాఢంగా వారిలో బయలుదేరింది. ఈ యుద్ధకాలంలో, సోవియట్‌ను గురించి తెలుసుకోవాలనే ఆపేక్ష ఎక్కువయిందని వారితో సంప్రతించినప్పుడు బోధపడింది. నిన్నమొన్నటివరకూ సోవియట్ రష్యాను గురించి తెలుసుకొనుటకై అవసరమైన గ్రంధాలు, నిర్మాణం లేకపోయినయి. ఇప్పుడు సోవియట్ రష్యాను గురించి తెలియజేసే ఆధునిక గ్రంధాలన్నీ సేకరించి విజ్ఞానపద్ధతులద్వారా పనిచేసే సోవియట్ మిత్రమండలిని వారు ఆహ్వానిస్తున్నారు. 10 పట్టణాల్లో సో. మి. మండలి నిర్మాణానికి అవసరమైన పని కొంతవరకూ జరిగింది. బెజవాడ, గుంటూరు, కర్నూల్ పట్టణాల్లో ఈ సంస్థలను స్థాపించి గ్రంధాలయాలను ఏర్పాటు గావించారు. రాజమండ్రి, కాకినాడ, విశాఖపట్టణం, విజయనగరములలో ఆర్గనైజింగ్ కమిటీలు వచ్చినయి. ఏలూరు, బందరు, ఒంగోలు పట్టణాలల్లోగూడా ఆర్గనైజర్లు పనిచేస్తున్నారు. యువకులుగా ఉండి ఉత్సాహవంతులైన లాయర్లు, డాక్టర్లు, లెక్చెరర్లు బాధ్యత వహించి పనిచేయుటకుముందుకు వస్తున్నారు. ఈ అభివృద్ధినిబట్టిచూస్తే త్వరలోనే రాష్ట్రంలోని అన్ని ముఖ్యపట్టణాల్లో సో. మి. మండలి ఏర్పాటు చేయబడవచ్చును. వాటి నిర్మాణంతోపాటు రాష్ట్ర సోవియట్ మిత్రమండలి ఏర్పడుతుంది.

కార్యక్రమం

సో. మి. మండలి కార్యకలాపాలన్నీ ప్రధానంగా విజ్ఞాన పద్ధతులద్వారా జరుగుతాయి. సోవియట్ విధానాన్ని గురించి పూర్తిగా విషయ జ్ఞానాన్ని పెంపొందించే ఆధునిక గ్రంధాలతోకూడిన గ్రంధాలయాలను ఏర్పరచి, సోవియట్ ప్రజల సాంఘిక, ఆర్థిక, రాజకీయ వ్యవహారాలను గురించి అధ్యయనం గావించి, చర్చలు, ఉపన్యాసాలు ఏర్పాటుచేయుట; అపోహలకు సమాధానములిచ్చి సోవియట్‌నుంచి నేర్చుకోవలసిన గుణపాఠములను మనప్రజలలో ప్రచారం గావించుటకై అనేక విజ్ఞాన పద్ధతులద్వారా కృషిచేయుట; ఈ కార్యక్రమంతో ఆంధ్రలో పని ప్రారంభించాం.

ఈ కార్యక్రమంతోపాటు సోవియట్ ప్రజల జీవితాన్ని గురించి తెలియజేయు "కజాకిస్తాన్," "సోవియట్ స్వాతంత్ర్య యుద్ధంలో ఒకరోజు" అను సోవియట్ ఫిల్ములను 10 ప్రదేశాల్లో 22000 మందికి ప్రదర్శించాం. వాటిద్వారా వసూలైన రు. 8200/- కరువుబాధితుల సహాయార్థం (ఎక్కువభాగం బెంగాలుకు) పంపాం. స్వతంత్ర ప్రజలై పరస్పరం దోపిడీ ఎరుగని సోవియట్ ప్రజల జీవితకార్యకలాపాలనుగురించి ఇంకా ప్రదర్శనాలు కావాలని చాలామంది కోరారు. స్త్రీలు ఈ ఫిల్ములను ఎక్కువగా అభినందించారు. ఆంధ్రప్రజల కోర్కెనుతీర్చిసోవియటు జీవితాన్ని ప్రచారంచేసే మంచిరకం ఫిల్ములను తెప్పించుటకు సో. మి. మండలి కృషి చేస్తుంది.

సోవియటు ప్రజల జీవితాన్ని వివరించే చిన్నచిన్న పుస్తకాలను ప్రచురించడానికూడ సో. మి. మండలి యూనిట్లు కృషిచేస్తయి.

అఖిలభారత సోవియట్ మిత్రమండలి మహాసభ

దాదాపు అన్నిరాష్ట్రాలకు వ్యాపించిన ఈ ఉద్యమానికి ఒక దేశవ్యాపిత నిర్మాణ రూపాన్నిఇచ్చి, అఖిలభారత సోవియట్ మిత్రమండలిని స్థాపించుటకై బొంబాయిలో 3, 4 తేదీలలో సమావేశం జరుగుతుంది. శ్రీ భూలాభాయ్‌దేశాయ్ అధ్యక్షతవహిస్తారు. యస్.ఎ. బ్రెల్వీగారు ఆహ్వానసంఘాధ్యక్షులు. అ. భా. సో. మి. మండలికి సంబంధించిన సమస్యలన్నీ చర్చించి ఈ ఉద్యమాన్ని మరింత అభివృద్ధిగావించి సోవియట్‌రష్యాకు భారతదేశానికి మధ్య గాఢమైన స్నేహసంబంధాలను పెంపొందించుటకు మార్గాలను అన్వేషిస్తారు. నిర్ణయాలు చేసుకుంటారు.

ఇతరరాష్ట్ర అనుభవాలను సేకరించుటకై ఆంధ్రరాష్ట్రంనుంచి గూడా ప్రతినిధులు యీ సమావేశానికి హాజరవుతున్నారు.

కార్మిక వార్తలు

అచ్చుపనివారలపై యజమానుల దాడి

ఏలూరులో అచ్చుపనివారు తిరిగి తమ సంఘాన్ని బలపరచుకొని చైతన్యంతో పని సాగిస్తున్నారు. కాగితం, సిరా, మొదలైన వాటిని పొదుపుగా వాడుతూ, అచ్చుపనికి విఘ్నంరానీయకుండా చేయాలనే సంకల్పంతో వీరున్నారు. ఇలా పనిచేస్తూనే తమఇబ్బందులను, సంఘబలంద్వారా తీర్చుకోవాలని వీరి ఆశయం. కాని, ఈ వైఖరి యజమానులకు నచ్చలేదు. యూనియన్‌లో సభ్యుడుగాచేరి ఉత్సాహంతో పనిచేస్తున్నందుకు సీతారామాంజనేయప్రెస్ యజమాని రాఘవయ్య అనే కార్మికున్ని పనిలోనుంచి తీసివేశారు. ఇది అక్రమమని కార్మికులు ఖండించారు. తిరిగి అతనిని పనిలో చేర్పించాలని కోరారు. యజమాని నిరాకరించినమీదట, యూనియన్ ద్వారా డిప్యూటీ కలక్టరుకి రాయబారం పంపారు. ఆయన విచారిస్తానన్నాడు.

ఈలోగా ఏలూరులోని ప్రెస్ ప్రొప్రయిటర్లందరూ కలిసి, "ప్రొప్రయిటర్సు అండ్ ప్రింటర్సు అసోసియేషన్" అని ఒక సంస్థగా ఏర్పడ్డారు. యూనియన్ని నాశనంచేసి, అచ్చుపనివారికి నోరులేకుండా చేయడమే వీరిఉద్దేశం. ఏప్రెస్‌లో నుంచయినా ఒక కార్మికుడ్ని తీసివేస్తే, తీసివేసిన యజమాని సిఫారసు చేయనిదే మరేప్రెస్‌లోనూ అతనికి పని ఇవ్వకూడదని ఈ సంస్థ తీర్మానమట. జీతాలివ్వడం, మానిపించేయడం మొదలయిన విషయాల్లో సర్వాధికారాలు యజమానివేనట. ఇక యూనియన్‌లోచేరే పనివారిగురించి వీరివైఖరిని వేరే చెప్పనక్కర్లేదు. వీళ్ళసమావేశం కార్మికుల కష్టసుఖాలకు సంబంధించినది కాబట్టి అందులో పాల్గొడానికి తమక్కూడాస్థానంఇవ్వండని యూనియన్ ప్రతినిధి కోరాడు. జవాబయినా ఇవ్వలేదు. సీతారామాంజనేయ ప్రొప్రయిటరు రాఘవయ్య మీద, ఇతర యూనియన్ ప్రముఖులమీద అసత్యపు ఆరోపణలు చేయడానికూడా ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తుంది.

ప్రభుత్వం యజమానుల ఈ పన్నాగాలు సాగకుండా వెంటనే అరికట్టాలి. రాఘవయ్యను తిరిగిచేర్చుకొనేలాచేయాలి. కార్మికులకు సక్రమమైన యుద్ధఅలవెన్సు అందేలా చేయాలి. కార్మికుల న్యాయమైన హక్కుల్ని కాపాడాలి. కార్మికులు నూటికి నూరుమంది సంఘంలోచేరి ఈ పన్నాగాలను ఎదుర్కోవాలి.

*

ఎక్కువ రేటును సాధించారు

జీవితావసర పదార్థాల ధరలు ఎంత పెరిగినా ఏలూరు చుట్టల పనివారికి పాతరేట్లే (10,000 కి పెద్ద చుట్టలకు రు. 0-11-0, చిన్న చుట్టలకు రు 0-10-0) ఇస్తూవచ్చారు యజమానులు. ఎంత మొరపెట్టినా హెచ్చు చేయలేదు. సంఘం పెట్టుకోవడం ద్వారా ఇలాంటి ఇబ్బందులు తీర్చుకోగలమని పని వారు గుర్తించారు. 14 వ తేదీని పని మానివేసి సంఘస్థాపనను గురించి ఆలోచించారు. 16 వ తేదీని, పట్టణ ట్రేడ్‌యూనియన్ కౌన్సిల్ తోడ్పాటుతో సంఘం ఏర్పర్చుకున్నారు. మరునాడు యూనియన్‌ద్వారా యజమానులవద్దకు రాయబారంవెళ్లారు. 10000 కి పెద్ద చుట్టలకు 0-12-6, చిన్నవాటికి 0-11-0 చొప్పున ఇవ్వడానికి యజమానులు అంగీకరించారు.

*

ఇళ్ళపన్ను తగ్గించుకున్నారు

వందమంది ఆదోని మునిసిపల్ కార్మికులు 16 వ తేదీని తమ సంఘం ఆధ్వర్యాన స్పెషలాఫీసరు వద్దకు రాయబారం వెళ్ళి, ఇంటి పన్నులు తగ్గించాలనీ, యుద్ధ అలవెన్సు హెచ్చించాలనీ, కార్మికుల సంఖ్యను హెచ్చించాలనీ కోరారు. ఈ వందమందిలో స్త్రీకార్మికులు చాలమందున్నారు. కార్మికులు సాగిస్తూవచ్చిన ఆందోళనకు అధికారి కొంతవరకయినా లొంగిరాక తప్పిందికాదు. ఇళ్ళపన్ను సగానికి సగం తగ్గించడానికి అధికారి అంగీకరించాడు. పడిపోయిన ఇళ్ళకు పన్ను పూర్తిగా తొలగిస్తానన్నాడు. డిసెంబరునుంచి రు 6-8-0, 1944 మార్చి నుంచి రు. 10 లు యుద్ధ అలవెన్సు ఇవ్వడానికి ఒప్పుకున్నాడు. కొత్త మురుగుకాలవలు పూర్తికాగానే అదనంగా పనివారిని చేర్చుకోవడంగురించి ఆలోచిస్తానని చెప్పాడు. సంఘబలం ద్వారా ఈ విజయాలు సాధించుకున్నందుకు కార్మికులు ఎంతోఉత్సాహం పొందారు. 21 వ తేదీని జరిగిన జనరల్ బాడీ మీటింగుకిఇదివరకెన్నడూ రానంతమంది కార్మికులువచ్చి, నాయకులిచ్చిన ఉపన్యాసాలను శ్రద్ధతో విన్నారు.

★

ఏ. ఐ. టి. యు. సి కి కార్మికుల విరాళం

ప్రపంచ ట్రేడ్‌యూనియన్ సమావేశానికి ప్రతినిధులు వెళ్ళిరాడానికి ట్రేడుయూనియన్లు విరాళాలిస్తున్నాయి. యం. యస్. యం. రైల్వే కార్మికసంఘం పెరంబూరు బ్రాంచిలో 2500 మంది కార్మికులు మొత్తం రు. 154 లు విరాళాలిచ్చారు. చిట్టివలస కాంగ్రెసు లేబరు యూనియన్ రు.10లు, విశాఖపట్టణం మునిసిపల్ కార్మికులు రు. 5 లు ఇచ్చారు. తెనాలి ఫ్యాక్టరీ వర్కర్సు యూనియన్, మునిసిపల్ కార్మికసంఘంవారు కలిసి రు. 9-13-0 లు ఇచ్చారు.

కార్మికుల ఆరోగ్యాన్ని కాపాడండి

— సి. వి. కె. రావు (అధ్యక్షుడు, ఆంధ్రరాష్ట్ర ట్రేడ్‌యూనియన్ కౌన్సిల్)

ఆంధ్రరాష్ట్రంలో ప్రతి పట్టణంలోను కార్మికుల పేటలు చాల అనారోగ్యకరంగా ఉన్నాయి. ఆపేటలు క్రిక్కిరిసి ఉండడం ఇందుకొక కారణం. ఆహారపదార్థాల ధరలు విపరీతంగా పెరిగిన ఈ రోజుల్లో, కార్మికులు నాసిరకం సరుకులు తప్ప వేరే కొనలేకుండా ఉన్నారు. దీనివల్ల వారి ఆరోగ్యం మరింత చెడుతూంది. పట్టణాల పారిశుద్ధ్యాన్ని కాపాడే మునిసిపల్ కార్మికుల స్థితి మరీ అధ్వాన్నంగా ఉంది. వీరు మంచంపట్టారంటే, పట్టణాల ఆరోగ్య పరిస్థితుల నిక వేరే చెప్పనక్కర్లేదు.

మద్రాసు ఆరోగ్యశాఖ లెక్కలనుబట్టి చూస్తే ఆంధ్రజిల్లాల్లో మలేరియా, మశూచి, కలరా మొదలయిన జబ్బులు వ్యాపించి వున్నట్లు తెలుస్తుంది. ఈరెండు నెలల్లో నేను గూడూరు, నెల్లూరు, తెనాలి, గుంటూరు, బెజవాడ, ఏలూరు, రాజమండ్రి, కాకినాడ పట్టణాలు చూచాను. జబ్బులులేని కార్మికపేట ఎక్కడా కనబడలేదు. మశూచి, కలరా మొదలయిన అంటువ్యాధులు కార్మిక పేటలతోనే ఆగవు. పట్టణంలోని ఇతర ప్రజల్లోకూడా వ్యాపిస్తాయి.

అంతేకాదు, కార్మికులు జబ్బులుపాలవడం వల్ల ఉత్పత్తికి పెద్ద దెబ్బ తగులుతుంది. అసలే సరుకులు చాలకుండా ఉన్న ఈ రోజుల్లో ఇదెంత ప్రమాదకరమో వేరే చెప్పనక్కర్లేదు. కాబట్టి, ఏవిధంగా చూసినా కార్మికపేటలను ఆరోగ్యకరంగా చేయడము, తద్వారా పట్టణ ఆరోగ్యాన్ని, ఉత్పత్తిని కాపాడడం ప్రజలందరి బాధ్యత. యజమానులు కూడ దీనివిషయమై శ్రద్ధతీసుకోవాలి.

మందులు

జాడ్యాలు మరింత తీవ్రమవడానికి మందుల కరువుకూడా కారణం. మునిసిపాలిటీల ఆరోగ్యశాఖవారు బీదప్రజలకు మందులు సరిగా సప్లయిచేసే ఏర్పాట్లు వెంటనే చేయాలి. మశూచికము మొదలయిన జాడ్యాల విషయములో ప్రజల్లో ఉన్న మూఢనమ్మకాలను తొలగించి, శాస్త్రజ్ఞానాన్ని వ్యాపింపజేయాలి. ఆ జాడ్యాల నరికట్టడానికి టీకాలు మొదలైన పద్ధతులను నచ్చజెప్పాలి. కాకినాడలో,మునిసిపాలిటీ లెక్కలనుబట్టి, 400 మంది మశూచికంతో బాధపడుతున్నారు. ప్రతి రోజూ సుమారు 8 మంది చనిపోతున్నారు. అయినా ప్రజలు టీకాల ఆవశ్యకతను గుర్తించడం లేదు. ఆరోగ్యశాఖవారయినా ఈ ఆవశ్యకతను వివరించడానికి శ్రద్ధ తీసుకోవడంలేదు. ఈ అశ్రద్ధే చావులకు కారణమంటే, అతిశయోక్తి కాదు.

ప్రస్తుతం 'ఆరోగ్యశాఖ సర్వే కమిటీ' మదరాసు రాష్ట్రంలో సంచారం చేస్తూంది. కాని ఆంధ్రరాష్ట్రంలో ఏలాంటి విచారణ లేదు. మదరాసు ప్రభుత్వ ఆరోగ్యశాఖ యొక్క నిర్లక్ష్యంవల్లనే, ఇక్కడి కార్మికుల ఆరోగ్య పరిస్థితులను గురించి ఇట్టి అశ్రద్ధ చూపబడింది.

అన్ని కార్మికసంఘాలు, ప్రజాసంస్థలు, కార్మికుల ఆరోగ్యాన్ని కాపాడ్డానికి ఈదిగువ కార్యక్రమం కొనసాగించాలి.

— పట్టణాలలోని వార్డులలో అనారోగ్య పరిస్థితులనుగురించి మెమోరాండంను తయారుచేసి మదరాసు ప్రభుత్వానికి, పబ్లిక్ హెల్తు డైరెక్టరుకు, మునిసిపాలిటీలకు పంపాలి.

— బీదలకు ఉచితంగా మందులు సప్లయి చేయాలవి మునిసిపాలిటీ, ప్రభుత్వ అధికారులపై ఒత్తిడి తేవాలి.

— పట్టణాల్లో ఆరోగ్యకమిటీలు ఏర్పరచి, కరపత్రాలు వేసి, ఆరోగ్య ప్రచారం చేయాలి.

— అంటువ్యాధులను గురించి తీసుకోవలసిన శ్రద్ధ సినిమాల్లో స్లయిడ్సుద్వారా మునిసిపాలిటీవారు ప్రచారం చేయించాలి.

— పట్టణ ఆరోగ్యాన్ని గురించి తగిన శ్రద్ధ తీసుకొనేలా మునిసిపాలిటీలపై ఒత్తిడి తేవాలి.

— యజమానులు కార్మికులకు తగిన కరువు భత్యాన్నిచ్చి వారికి సరియగు తిండి సౌకర్యానికి పాటుపడాలి.

— మునిసిపల్ కార్మికులలో దేశభక్తిని రేకెత్తించి పట్టణ పారిశుద్ధ్యాన్ని కాపాడేటట్లు చేయాలి.

★

జాడ్యాల నరికట్టడానికి ప్రజల కృషి

ఒంగోలు తాలూకా (గుంటూరుజిల్లా)లో సముద్రతీరాన్నున్న కొత్తపట్టణం, గుండమోల, మూటమోల మొదలైన గ్రామాల్లో మూడుమాసాలనుంచి కోస్టల్ మలేరియా తీవ్రంగా ఉంది. సుమారు వేయిమంది జబ్బుపడ్డారు. ఇంచుమించు 60 మంది చనిపోయారు. కొన్ని కుటుంబాలల్లో గంజిపోసే దిక్కు కూడా లేదు. రైతుసంఘంవారు, కమ్యూనిస్టులు ఈపరిస్థితులను వెంటనే సబ్ కలెక్టరుకు తెలియజేశారు. అంతటితో ఊరుకోకుండా తామే డబ్బు వసూలుచేసి 600 క్వినైన్‌మాత్రలు, 30 పౌనులు పంచతిక్తకషాయంకొని మందులివ్వడం ప్రారంభించారు. పత్యం జరుపుకోలేనివారికి వేయించిన నూకలుకూడ సప్లయి చేశారు. మలేరియా నివారణకృషి నిర్మాణయుక్తంగా జరపడం కోసం 18 వ తేదీని ఒంగోలు ప్రముఖుల సమావేశమయి ఒకకమిటీని ఏర్పాటుచేశారు. అన్నివర్గాల ప్రజలు ఈ కమిటీకి తోడ్పడి మలేరియా జాడ్యాన్ని అరికట్టాలి.

★

రైలులో బెంగాల్ నిధి

కొతవరంలో స్నేహితుల పెళ్ళిచూచుకొని బెజవాడకు తిరిగివస్తూ కామ్రేడ్స్ మోటూరి ఉదయం, కె. ధీమతి, సి. నిర్మలకుమారి, యం. సత్యనారాయణ, సి. రామారాయ్ రైలులో బెంగాలునిధి వసూలుచేశారు. పెట్టిపెట్టి తిరిగి 5, 6 వందలమందిలో కరువు నివారణ ప్రచారంచేశారు. మొత్తం రు. 46 లు వసూలయింది. ఈమొత్తం బెంగాలు మహిళా ఆత్మరక్షణసమితికి పంపబడింది.

జోహారులు

●

కామ్రేడ్ గుజ్జర్లపూడి నాగేశ్వర్రావది గుంటూరు తాలూకాలోని నేలపాడు. 18 ఏళ్ళ యువకుడు. పార్టీ సభ్యుడు. యువజన రంగంలో ఆదర్శప్రాయంగా పనిచేస్తుండేవాడు. ఎన్ని ఆటంకాలు కలిగినా లెక్కచేయక, తనకృషిని వ్యవసాయకూలీరంగానికూడా వ్యాపింపజేశాడు. బెజవాడ కాలువ పనిలో పాల్గొనడానికి 18 వ తేదీని అందరినీ సమీకరించడం ప్రారంభించాడు. అనాటి రాత్రి హటాత్తుగ టైఫాయిడ్‌జ్వరం వచ్చింది. నోట మాటలేక, కంటి చూపులేక రెండు రోజులు బాధపడ్డాడు కామ్రేడ్. 20 వ తేదీ సాయింత్రం 7 గంటలకు చనిపోయాడు.

కామ్రేడ్ నాగేశ్వర్రావుకి మా జోహారులు.

★

కాట్రగడ్డ సుదర్శనం (గోవాడ) 18 ఏళ్ళ యువకుడు. 1942 అగస్టు తరువాత పార్టీలోకి వచ్చాడు. అప్పటినుంచి పార్టీ కార్యక్రమాన్ని ఆదర్శదీక్షతో నెరవేరుస్తూ వచ్చాడు. రెండు నెలలనుంచి క్షయవ్యాధితో పీడింపబడి, 9-5-44 వ తేదీని చనిపోయాడు. కామ్రేడ్‌కి మా జోహార్లు. అతని కుటుంబానికి సానుభూతి.

స్త్రీల సౌకర్యాలకోసం ఆందోళన

—///—

గ్రామాల్లో మరుగుదొడ్లులేక స్త్రీలు ఎంతో బాధపడుతున్నారు. మరుగుదొడ్లకోసం సర్వత్రా ఆందోళన జరుగుతూంది. ఇలాంటప్పుడు దుర్వినియోగం చేస్తున్నారన్న మిషమీద ఉన్నమరుగుదొడ్డిని, ముళ్లకంపలతోమూయించాడు మండపేట (తూర్పుగోదావరి) పంచాయితీబోర్డు అధికారి. వెంటనే కామ్రేడ్ మాణిక్యాంబగారు, సుమారు 40 మంది స్త్రీలతో రాయబారం వెళ్ళి, ఈచర్యవల్ల స్త్రీలకెంత ఇబ్బందో వివరించారు. మరుగుదొడ్డి దుర్వినియోగంగాకుండా మహిళల్లో ప్రచారం చేయండనికోరుతూ, అధికారి దొడ్డిని తిరిగి తెరిపించాడు.

తూర్పుగోదావరిజిల్లాలోనే దుళ్ళగ్రామంలో మరుగువొడ్డిసమస్య స్త్రీలకు చాలా ఇబ్బంది కలిగిస్తూంది. ఇనుగంటి రామతులశమ్మగారు 150 సంతకాలతో ఒక మహజరు పట్టుకొని పంచాయితీబోర్డు అధ్యక్షునివద్దకు వెళ్ళారు. అధ్యక్షులు మరుగువొడ్డికట్టించడానికి అంగీకరించారు.

ప్రసూతి సౌకర్యాలకోసం మహిళల ఐక్యత

రాజమండ్రిలో సుమారు 1500 మంది రైల్వేకార్మికులున్నారు. వీరందరికి ఉన్నది ఒక్కటే హాస్పిటల్ అందులో లేడీడాక్టరుగాని, నర్సుగాని లేరు. అందువల్ల ఈ కార్మికుల స్త్రీలు జబ్బుపడి వచ్చినపుడు, పురుళ్ళకు స్త్రీల హాస్పిటళ్ళకు వెళ్ళవలసి వస్తూంది. అక్కడయ్యే ఖర్చులు కార్మికుల శక్తికిమించి ఉంటున్నాయి. రైల్వే హాస్పిటలులో లేడీ డాక్టరు, నర్సు, యొక్క అవసరాన్ని వెల్లడిచేస్తూ స్థానికమహిళాసంఘంప్రచారంచేసింది. కామ్రేడ్స్ వి. జగదాంబ, కె. మహాలక్ష్మి, రైల్వేకాలనీలో గ్రూపుమీటింగులు ఏర్పాటు చేశారు. కత్తైలు, కిరసనాయిలు కూడా చౌకడిపోలద్వారా సప్లయి చేయించవలసిన అవసరాన్నికూడా ప్రచారం చేశారు. లేడీ డాక్టరు, నర్సులను నియమించాలని రైల్వే అధికారులను కోరుతూ పంపిన మహజరుపైని ఆంగ్లో ఇండియన్లు, క్రిస్టియన్లు, ముస్లింలు - అన్నిజాతుల కార్మిక స్త్రీలు మొత్తం 350 మంది సంతకాలు పెట్టారు. వీరు విరివిగా మహిళాసంఘంలో చేరుతున్నారు కూడా.

★

నీళ్ళ సప్లయి ఎక్కువ చేయించుకున్నారు

ఏలూరులోని రామచంద్రరావుపేటలో సుమారు 4000 మంది చేనేత పారిశ్రామికులున్నారు. ఆ పేటలో అంతా ఉన్నవి అరు పైపులే. వాటిలోకూడ నిర్ణీతసమయాల్లోనే నీరు వస్తుంది. స్థానిక మహిళాసంఘం ఆందోళన ఫలితంగా అదనంగా మరో రెండు గంటలసేపు నీరు వదలడానికి మునిసిపల్ అధికారు లంగీకరించారు.

★

6 వ కృష్ణా జిల్లా మహిళాసంఘ వార్షిక సమావేశం

జమా ఖర్చులు

	జమలు		
డెలిగేట్లఫీజు	70	0	0
చందాలు	50	0	0
విజిటర్సు భోజనంబాపతు	5	12	0
	125	12	0

బియ్యం పది గ్రామాలనుండి వసూలైనవి.

	ఖర్చులు		
విస్తళ్ళు	9	12	[illegible]
టిఫిన్	11	4	[illegible]
పుల్లలు	13	8	[illegible]
కూలీలకు, వంటవాళ్ళకు	25	0	[illegible]
బళ్ళకు	10	0	[illegible]
బహుమతులు	10	6	[illegible]
ప్రింటింగు	6	0	[illegible]
పోస్టల్	5	0	[illegible]
కూరలు, చిల్లర ఖర్చులు	83	11	[illegible]
	174	9	[illegible]
	125	12	[illegible]
జిల్లాసంఘంనుండి ఖర్చు	48	13	[illegible]

Printed and Published by Katragadda Rajagopala Rao at Prajasakti Press, Governorpet - Bezwada.

END OF ISSUE